ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 17 | సంచిక : 04 | డిసెంబర్ 2011

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
పు॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు ~ 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ......... 19-06-2011
హైదరాబాదు ... 23-09-2011
అమలాపురం .. 23-10-2011

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-06-2011, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహాన్ని కేంద్రంగా, మనస్సుని కేంద్రంగా పెట్టుకొని వచ్చే ఏ కోరిక లేకుండా, నాకు అది కావాలి, ఇది కావాలి అనే కోరిక లేకుండా ఉండటమే పరిపూర్ణమైన శరణాగతి కదా అని ఒకరు భగవాన్‌ని అడిగారు. నీకు వ్యక్తిగతమైన కోరికలు అంటూ ఏమీ ఉండకూడదు. భగవంతుడు నీకు ఏది అనుగ్రహిస్తే దానితో సంతుష్టుడవై ఉండాలి. అది పరిపూర్ణమైన శరణాగతి. నీ దేహప్రారబ్ధాన్ని బట్టి నీ కోటాకి ఇచ్చేది ఇస్తూ ఉంటాడు. దానితోటి నువ్వు సంతృప్తి పడకుండా నువ్వు దురాశ కలిగిఉంటే అది శరణాగతి అవ్వదు అని భగవాన్ చెప్పారు. ఒక దేహంతోటి, ఒక పేరుతోటి తాదాత్మ్యం లేకుండా ఉండటమే జ్ఞానం. రూపంతోటి, నామంతోటి తాదాత్మ్యం వలనే కీర్తికాంక్ష వస్తుంది, వ్యక్తిగతమైన కోరికలు వస్తాయి. ఫలానా దేహాన్ని నేను, ఫలానా పేరు నాది అనేటువంటి తాదాత్మ్యాన్ని వదిలించుకోవటమే మనం చెయ్యవలసిన ముఖ్యమైన సాధన.

గాంధీగారు భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం కృషి చేస్తున్నారు. మరి అది కూడా కోరికే కదా అని భగవాన్‌ని అడిగారు. అది కూడా కోరికే అయితే ఆ కోరిక ఆయన దేహానికీ, మనస్సుకీ సంబంధించినది కాదు. అది సమిష్టిగా ఆయన ఆలోచించి చేస్తున్నారు కాబట్టి ఆ కోరిక ఆయన హృదయాన్ని విశాలం చేస్తుంది, బుద్ధిని విశాలం చేస్తుంది. అది ఆత్మజ్ఞానానికి ప్రిపేర్ చేస్తుంది. గాంధీగారు హృదయపూర్వకంగా కృషిచేసినమాట నిజమే కాని భగవంతుడి సంకల్పం ఎలా ఉంటే అలా జరుగుతుంది. జరిగేది భగవంతుడి సంకల్పం అనుకునేది మన

సంకల్పం. జ్ఞానం పొందటానికి నేను తీసుకోవలసిన చర్యలు ఏమిటి అని భగవాన్‌ను అడిగితే భగవాన్ రెండు మార్గాలు చెప్పారు. ఇప్పుడు నువ్వు నేను, నేను అంటున్నావు. ఆ నేను యొక్క మూలాన్ని కనుగొనటం ఒక పద్ధతి. ఈ నేను వల్ల ఏమీ అవ్వదు. నేను అసక్తుడిని, ఈశ్వరుడికి అన్ని శక్తులూ ఉన్నాయి, ఆయనపై భారం వేయటం తప్ప నాకు మరో మార్గం లేదు అనుకోవటం శరణాగతిమార్గం. జ్ఞానమార్గంలో వెళ్ళినా, శరణాగతిమార్గంలో వెళ్ళినా ఈ నేనులోంచి బయటపడాలి. భగవాన్ చెప్పిన సీక్రెట్ ఇది. అంతేగాని బండతనంగా జపం, ధ్యానం చేసినంత మాత్రం చేత జ్ఞానంరాదు.

భగవాన్ చెప్పిన ప్రాసెస్ జప, ధ్యానముల కంటే ఎక్కువ ఉపయోగపడుతుంది. మీరు జాగ్రత్తగా అర్థం చేసుకోండి. ఈ జన్మలో అయినా, రాబోయే జన్మలో అయినా ఈ నేను అనే సమస్యను పరిష్కారం చేసుకోవాలి. మీరు ధ్యానం బాగా చేస్తున్నారు. నిజమైన నేనుకి ధ్యానం అక్కరలేదు. ఈ దొంగనేనే ధ్యానం చేస్తుంది. జపం ఎవరు చేస్తారు, ఈ దొంగ నేనే జపం చేస్తుంది. మీరు జపం చేస్తున్నారు, ధ్యానం చేస్తున్నారు కానీ వీడు మిగిలిపోతున్నాడు కదా! ఈ నేనులో నుండి నువ్వు విడుదల పొందకపోతే ఎన్ని చేసినా ఏమీ ప్రయోజనం లేదు. ఈ అబద్ధమైన నేను మీదే లోకము, పునర్జన్మలు, పూర్వజన్మలు, దేవతలు అందరూ ఆధారపడి ఉన్నారు. అందుచేత నీకు సంతోషం వస్తోంది అని నువ్వు సంతోషించకు. ఈ సంతోషం ఏ నేనుకు వస్తోంది? మీకు అశాంతి వస్తోంది అనుకోండి, ఈ అశాంతి ఏ నేనుకి వస్తోంది? మీకు గర్వం వస్తే ఈ గర్వం ఏ నేనుకి వస్తోంది? ఇవి సత్యమైననేనుకి రావటంలేదు. అవన్నీ అసత్యం కాబట్టే అసత్యమైననేనుకి ఇవన్నీ వస్తున్నాయి అని మీరు మాట మాటకి ఆ నేనుని ప్రశ్నించుకోవటం వలన అది నెమ్మదిగా లోపలికి జరగటం ప్రారంభిస్తుంది. ఈ పద్ధతిని మీరు గుడ్డితనంగా చేయటంకాదు. ఒక ఎడ్యుకేషనల్ ప్రాసెస్ ఇది. ఇది మీకు అర్థం అయితే జపంకంటే, ధ్యానంకంటే ఇది తేలిక. నేను, నేను అని చెప్పే ఈ నేను ఎవరు? ఇతరుల్ని నువ్వెవరు? నువ్వెవరు? అని ప్రశ్నించటంకంటే ఈ నేనును మనం ప్రశ్నించుకొంటూ ఉంటే లోచూపు కలుగుతుంది, అంతర్ముఖం కలిగి అది ఎక్కడ నుంచి ఉదయించి వస్తోందో అక్కడకి జరగటం ప్రారంభిస్తుంది. అది జప, ధ్యానములకంటే మంచిది. శారీరకంగా మీరు పెద్ద శ్రమపడనక్కరలేదు. అయితే ఈ ప్రాసెస్ చేసేటప్పుడు మీరు ఆహారవిషయంలో జాగ్రత్తగా ఉండాలి, అతి నిద్ర ఉండకూడదు, అవి యోగానికి భంగం. అందుచేత మీరు ఈరకంగా ప్రయత్నం చేస్తే అసత్యమైన నేనులోంచి విడుదల పొందుతారు.

మీరు ధ్యానం చెయ్యవచ్చు, జపం చెయ్యవచ్చు కాని అవి స్ప్రింగు మంచం లాంటివి. మనం స్ప్రింగు మంచం మీద కూర్చున్నప్పుడు అది కిందికి వెళుతుంది. మనం ఆ మంచం మీద నుంచి లేవగానే ఆ స్ప్రింగు మంచం మామూలు స్థితికి వచ్చేస్తుంది. ఈ మనస్సు కూడా అంతే. మీరు జపం చేసినప్పుడు ఆ పది నిమిషాలు బావుంటుంది, ధ్యానం చేసినప్పుడు మీకు శాంతిగా ఉంది అని ఆ పదినిమిషాలు అనిపిస్తుంది. తరువాత ఈ నేను మళ్ళీ మామూలుగా విజృంభించేస్తుంది. భగవాన్ ఏమని చెప్పారు అంటే మీరు ధ్యానం చేసినా ఈ నేను కొంత అణిగుతుంది, జపం చేసినా ఈ నేను కొంత అణుగుతుంది. ఆ రెండూ చేయలేకపోతే మహాత్ముల సన్నిధానంలో కూర్చున్నా ఈ నేను దానంతట అదే అణిగిపోతుంది. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహగతమైన నేనులో నుండి విడుదల పొందాలి. హృదయంలో సద్వస్తువు లేకపోతే అది వశిష్టుడికీ అనుభవంలోనికి రాదు, విశ్వామిత్రుడికీ అనుభవంలోనికి రాదు కదా! అది లోపల ఉంది కాబట్టి వాళ్ళకి అనుభవంలోనికి వచ్చింది. అలాగ మనం కూడా పొందవచ్చును అనేటువంటి ఆత్మవిశ్వాసం మనకి ఉండాలి. ఈ మార్గంలో పిరికితనం ఉండకూడదు, అనుకరణ ఉండకూడదు. మన మనస్సు అంతర్ముఖం అవ్వటానికి ఏ కారణాలు అయితే అడ్డువస్తున్నాయో ఆ కారణాల్ని తొలగించుకుంటూ ఉంటే మనస్సు వెళ్ళి దాని మూలంలో పడిపోతుంది.

భగవంతుడిపైన పూర్తిగా భారం వేసి జీవించటం శరణాగతి. అందుచేత నువ్వు పూర్తిగా భగవంతుడిమీద భారం వెయ్యి. శరణాగతి ఎలాఉండాలి అంటే, ఈ పుస్తకం నాచేతిలో ఉంది, నేను ఈ పుస్తకాన్ని కింద పెట్టేస్తాను. నన్ను కింద ఎందుకుపెట్టారు అని ఈ పుస్తకం అడగదు, చేతిలో పెట్టుకుంటే ఎందుకు చేతిలో పెట్టుకున్నారు అని అడగదు. ఈ పుస్తకాన్ని పుష్పాలు పెట్టి పూజిస్తే నన్ను ఎందుకు పూజిస్తున్నారు అని అడుగదు. ఎలాగ చేసినా ఆ పుస్తకం ఎంత క్వయిట్‌గా, ఎంత కామ్‌గా ఉంటుందో అలా మీ మనస్సు కూడా ఉండగలగాలి. ఆయన సంకల్పమే మన సంకల్పం, ఆయన ఇష్టమే మన ఇష్టం అని ఎవడైతే జీవిస్తున్నాడో వాడు శరణాగతి చేసినట్టు. బాగా డబ్బు ఉన్న వాళ్ళని మీరు డబ్బు బాగా సంపాదించారు అనండి. మీరు ఆ మాట అనకముందు ఎలా ఉన్నారో ఆ మాట అన్నాక వారు అలాగ ఉండరు. వాడికి ఎంతోకొంత సంతోషం వస్తుంది. ఎందుచేతనంటే ఆ మాట యొక్క ప్రభావం వాడి అహంకారం మీద పడి వాడికి సంతోషం వస్తోంది. ఆ సంతోషకారణం వాడి మనస్సుని అంతర్ముఖం అవ్వనివ్వదు. ఆ మాట అనకముందు నువ్వు ఎలా ఉన్నావో, ఆ

మాట అన్నాక కూడా నువ్వు అలాగ ఉండగలిగితే నువ్వు యోగివి అవుతావు. చాలామందికి వాళ్ళని వాళ్ళు పొగుడుకోవటం చాలా ఇష్టం. ఇది చాలా ప్రమాదం. మిమ్మల్ని ఎవరైనా పొగుడుతున్నారు అనుకోండి వాళ్ళని పొగడవద్దు అంటే మానరుకదా! మీరు వెంటనే ఆ సబ్జెక్టు మార్చేసి ఇంకో సబ్జెక్టు మాట్లాడాలి. ఆ పొగడ్తలు మీరు వినటంవలన దేహగతమైన నేను పెరిగిపోతూ ఉంటుంది. మీరు ఇతరులను విమర్శించటం వలన కూడా ఆ నేను పెరిగిపోతూ ఉంటుంది. అందుచేత దైనందినజీవితంలో మన ప్రవర్తన ఎలా ఉందో పరిశీలన చేసుకుంటూ ఉండాలి. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. అన్ని శక్తులూ భగవంతుడికి ఉన్నాయి. నాకు ఏ శక్తులూ లేవు. ఈ అహంకారం ఎందుకు పనికి రానిది. ఒకవేళ నాకు ఏదైనా శక్తి ఉంటే అది భగవంతుడు ప్రసాదించినదే. ఆయనే సర్వస్వం అనే నమ్మకం నీకు స్థిరపడాలి. అలా స్థిరపడితే అది శరణాగతి. శరణాగతిలో కూడా దేహగతమైన నేను పోతుంది. భక్తి కూడా అద్వైతానుభవానికే తీసుకువెళుతుంది. ద్వైతం వలన భయం వస్తుంది, దుఃఖం వస్తుంది, వేదన వస్తుంది. ద్వైతం వలన విరోధాలు వస్తాయి. మీకు ఏ విషయంలో అయినా భయం వేస్తోంది అనుకోండి, మీలో ద్వైతబుద్ధి ఉన్నట్టే. ఏది జరిగినా భగవంతుడి సంకల్పం ప్రకారమే జరుగుతోంది అని నీకు నూటికి నూరుపాళ్ళు విశ్వాసం కలిగితే అప్పుడు నీకు శరణాగతి పూర్తి అయినట్టు.

చెడ్డస్నేహాలు మొట్టమొదటిలో తియ్యగా ఉంటాయి. ఆ స్నేహం పరిణామంలో విషం అయిపోతుంది. మీ చావుకి కూడా అది దారితీయవచ్చు. మంచి స్నేహాలు అలాక్కాదు. మొదటిలో ఆ స్నేహాలు పెద్ద తియ్యగా ఉండవు. మంచి స్నేహితులు ఎలా ఉంటారు అంటే మీకు ఏదైనా మంచి చేస్తే చేస్తారు కాని వాళ్ళు అల్లరిచిల్లరిగా ఉండరు. మంచి స్నేహితులు మీకు మొదట నచ్చకపోయినా వారు పరిణామంలో మిమ్మల్ని మోక్షం వరకూ తీసుకువెడతారు. మనం మంచిగా లేకపోవచ్చు, ఎదుటివారి మంచితనం గురించి చెబుతూ ఉంటే అది భరించలేకపోతే ఎలాగ? ఇంక మనకి జ్ఞానం ఏమిటి? చాలామంది మనుషులు పాడైపోవటానికి కారణం ఏమిటి అంటే స్వార్థం. స్వార్థం ఉన్నవాడు దేహభావనలోంచి విడుదల పొందలేడు. స్వార్థమే పాపం, స్వార్థానికి మించిన పాపం లేదు. ప్రపంచంలో స్వార్థం తప్పించి ఇంకో పాపం ఉందని నేను అనుకోవటం లేదు అని వివేకానంద అన్నాడు. నమ్మాళ్వార్ ఏమన్నాడు అంటే ఓ పెరుమాళ్ళూ ఇంతవరకూ నీవు వేరు, నేను వేరు అని నేను నిన్ను ప్రార్థిస్తూ వచ్చాను. నిన్ను తెలుసుకోవటానికి ప్రయత్నం చేసి తెలుసుకున్నాను.

నిన్ను తెలుసుకున్నాక నువ్వే ఉన్నావు, నేను లేనని నాకు తెలిసింది. అది అద్వైతమే. శరణాగతి చివరికి అద్వైతంలోనికి తీసుకువెళ్ళింది. అది కూడా ఆత్మ జ్ఞానంతోటి సమానం. శరణాగతి గురించి మీరు విన్నప్పడు తేలిక అనిపిస్తుంది. కాని మీరు అనుకున్నంత తేలిక కాదు. శరణాగతి చేసినవాడికి ఇష్టం, అయిష్టం ఉండకూడదు. ఇష్టాలు, అయిష్టాలు ఉన్నవాడు శరణాగతి చేయలేడు. శరణాగతి చేసినవాడికి నెమ్మదిగా రాగద్వేషాలు పోతాయి. స్వార్థం లేకుండా పని చేయాలి. అది మీరు అనుకున్నంత తేలిక కాదు. నువ్వు చేసేపని ఎలా ఉండాలి అంటే నేనులోంచి విడుదలపొందటానికి అది సహకరించాలి. అదీ కర్మయోగం. నువ్వు కర్మని యోగంగా చేస్తే, కర్మని నేర్పుగా చేస్తే అప్పడు కూడా ఈ నేనులోంచి నువ్వు విడుదల పొందుతావు.

కొంతమంది కర్మ చేసి వాళ్ళకి ఉపకారం చేసాము, వీళ్ళకి ఉపకారం చేసాము అని అనుకుంటారు. అంటే వాళ్ళకంటే నువ్వు భిన్నం అనుకుంటున్నావు. అక్కడ ద్వైతబుద్ధి వచ్చింది. ఆ దేహాన్ని కూడా నీ దేహంగా చూచుకోలేకపోతున్నావు అది కర్మయోగం కాదు. మిమ్మల్ని మీరు ఎలా ప్రేమించుకుంటున్నారో అలాగ ఇతరుల్ని ప్రేమించగలిగినవాడే కర్మయోగి అవుతాడు కాని మిగతావాళ్ళు కర్మయోగులు అవ్వరు. నువ్వు అన్నం తింటున్నావు, ఎవరికో ఉపకారం చేసాను అనుకుంటున్నావా? అనుకోవటం లేదు. ఇంకొకళ్ళకి అన్నం పెడితే వాళ్ళకి ఉపకారం చేసాను అనుకుంటున్నావు. మనిషి యొక్క స్వార్థబుద్ధి, దుష్టబుద్ధి ఇక్కడే ఉంది. ఆ దేహం వేరు, నా దేహం వేరు అనే బేధబుద్ధి ఉంది కదా. ఆ బేధబుద్ధి నశించకపోతే అది కర్మయోగం కాదు. చొక్కాకో జేబు ఉంది, లాగుకో జేబు ఉంది. లాగు జేబులో ఉన్న పది రూపాయలు తీసుకొని చొక్కా జేబులో పెడతాను అనుకో, అది ఎవరికి అయినా ఇచ్చాను అని నువ్వు అనుకొంటున్నావా? లేదు. ఎందుచేత! ఈ జేబు నీదే, ఆ జేబు నీదే. ఆ రకంగా నువ్వు కర్మ చేస్తే ఈ మిధ్యానేనులోంచి నువ్వు బయటకి వచ్చేస్తావు. కర్మయోగంలో గొప్పతనం ఏమిటి అంటే నువ్వు చేసే కర్మలో నీ మైనస్‌పాయింట్స్, ప్లస్‌పాయింట్స్ తెలుస్తుంది. పని చెయ్యటం మొదలు పెట్టాక నీకు ఆత్మజ్ఞానం లేదని తెలుస్తుంది కాని అది పుస్తకాలు చదవటం వలన రాదు. కర్మయోగం వలన కూడా అనేకమంది ఆత్మజ్ఞానం పొందినవాళ్ళు ఉన్నారు. కర్మయోగి ఈ సృష్టి అంతా ఈశ్వరుని శరీరం అనే భావనతో పనిచేస్తాడు. అలా పని చేసినప్పడు వాడికి ఈ నేను పోతుంది. మదర్‌థెరిస్సా వాళ్ళు అలా పని చేసారు. వాళ్ళు వర్కు చేసారు కానీ నెత్తిమీద ఏమీ మోయలేదు. ఇప్పడు ఇంట్లో వాళ్ళు ఇంట్లో వాళ్ళే

గుర్తింపు కోరుకుంటున్నారు. ఇంక వాళ్ళకి సేవ ఏమిటి? భగవంతుడు నువ్వు చేసే వర్కు చూస్తూ ఉంటాడు. నువ్వు ఆ పని ఏ ఉద్దేశ్యంతోటి చేస్తున్నావు? స్వార్థంతోటి చేస్తున్నావా? లేకపోతే ఈశ్వరుని అర్చనగా చేస్తున్నావా? అని లోపల ఉన్న అంతర్యామి పరిశీలిస్తాడు. కొంతమంది పని ద్వారానే తరిస్తారు. అన్ని మార్గాలూ మంచివే. కర్మమార్గంలో అయినా, భక్తి మార్గంలో అయినా, జ్ఞానమార్గంలో అయినా మనస్సుని తన మూలంలోకి తీసుకువెళ్ళి అక్కడ అణిచివేయాలి. మనస్సు దాని మూలంలో స్థిరంగా ఉండటం వలన అది కరిగిపోతుంది, అప్పుడు నీకు నోమైండు స్టేటు వస్తుంది. దానిని మృతమనస్సు అంటారు. అప్పుడు అది నిన్ను బంధించదు. అది కాలిపోయిన తాడులాంటిది.

శరణాగతి పూర్తి అయిన తరువాత మనస్సు ఎలా ఉంటుంది అని ఒకరు భగవాన్‌ని అడిగారు. అమనస్కస్థితి గురించి నేను చెప్పినా నీకు తెలియదు. అది అనుభవంలోనికి వచ్చాక నీకు తెలుస్తుంది. అది నోటితోటి చెప్పేదికాదు, మనస్సుతోటి ఆలోచించేది కాదు. నువ్వు శరణాగతి చేస్తే నీకు వచ్చే లాభం ఏమిటి అంటే? నీకు వ్యక్తిగతమైన కోరికలు తగ్గిపోతాయి. జ్ఞానికి శరీరం అవసరం లేదు. ఏ కోరికా లేనివాడు శరీరం ఏమి చేసుకుంటాడు. కూలికోసం మోసేవాడు ఆ పెట్టెని ఎప్పుడు కింద పెట్టేద్దామా అని కనిపెట్టుకొని చూస్తూ ఉంటాడు కాని నెత్తిమీద ఇంకో గంటసేపు ఈ పెట్టె ఉంటే బావుండును అని అనుకోడు. అలాగే జ్ఞాని కూడా దేహాన్ని విడిచిపెట్టటానికి అలా కనిపెట్టుకొని ఉంటాడు. జ్ఞాని సుఖపడటానికి కాని, సంతోషించటానికి కాని శరీరంతోటి పనిలేదు. శరీరంతోటి పనిలేనప్పుడు జ్ఞానికి శరీరం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. మనం నేను, నాది అని అనుకుంటాము. అవి నిజంగా లేవు. కానీ అవి ఉన్నాయి అని నువ్వు అనుకుంటున్నావు. అవి రెండూ తలంపులే. ఈశ్వరుడు తప్పించి ఈలోకంలో ఏమీ లేదని ఆ గ్రహింపు నీకు రావాలి. దాని తాలుక అనుభవం వస్తే నీకు దుఃఖం వెదికినా దొరకదు. అదే జ్ఞానం, అదే భక్తి, అదే యోగం. నేను, నాది అనేది ఉందని ఎంత గట్టిగా అనుకుంటున్నామో అలాగే ఈశ్వరుడు ఉన్నాడని అంతగట్టిగా మనం అనుకోవటం లేదు, ఈశ్వరుడు తప్పించి ఏమీ లేదు అని నువ్వు నోటితోటి అంటే చాలదు. అది నీ అనుభవంలోనికి రావాలి. ఉన్నదేదో మనకి అర్థం అయ్యేవరకూ లేనిది ఉందని అనుకుంటూనే ఉంటాము. ఆత్మ తప్పించి వేరే ఏమీ లేదని ఆ గ్రహింపు మనకు రావాలి.

భక్తి అంటే కోరికలతోటి సంబంధం లేకుండా, కారణాలతోటి సంబంధం లేకుండా

అకారణంగా మీకు ఈశ్వరుడి పాదాల మీద ప్రేమకలిగితే అది భక్తి. ఆ భక్తికి కారణం కనిపిస్తే అది వ్యాపారంలోకి వస్తుంది. భగవంతుడు సంకల్పం ప్రకారం నువ్వు ఉండాలి కాని నీ సంకల్పాన్ని నెరవేర్చమని నువ్వు అడగకూడదు. నీ మనస్సులో ఏ కోరికలు అయితే ఉన్నాయో దానికి అనుగుణంగా ఆయనని ప్రవర్తించమంటే అది భక్తా లేకపోతే భగవంతుడి మీద పెత్తనం చెయ్యటమా? దేవుడి మీద భక్తి ఉన్నవాడు ఆయన మీద పెత్తనం చెయ్యాలని చూడడు. నాకు ఇది కావాలి, అది కావాలి అని అసలు అడగడు. నీ సంకల్పం నెరవేర్చాడు అనుకో, ఆ సంకల్పం వలన వచ్చే పరిణామాలు నీకు తెలియవు కదా! దానివలన నువ్వు ప్రమాదాలలో పడవచ్చు. అందుచేత భగవంతుడిని ఏమీ కోరుకోకు. నీకు ఏది మంచిదో నీకంటే ఈశ్వరుడికే బాగా తెలుసు. నువ్వేమీ అడగకుండా అంతా ఆయనకే విడిచిపెట్టేస్తే మొత్తం నీ భారం అంతా ఆయనే మోస్తాడు. నీకు ఏదైనా బెంగ పెట్టుకునే కారణం ఉన్నా నువ్వు బెంగపెట్టుకోకపోతే నీ బెంగ ఆయనే తీసుకుంటాడు. అప్పుడు నీ బెంగ పలచబడిపోతుంది. నీకు చింతకి కారణం ఉన్నా నువ్వు చింతలేకుండా ఉంటే నీ చింత ఆయన పుచ్చుకుంటాడు. గతి అల్లా శరణాగతే, శరణాగతి వల్ల కూడా మనోనాశనం అవుతుంది. మనం నేను నేను అంటాం కదా! ఆ నేను అంటే నీకు బాగా ఇష్టమే కదా! ఆ నేనుని ఈశ్వరుడి పాదాల దగ్గర సమర్పించటమే భక్తి. నీకు భోగప్రవృత్తి ఉన్నప్పుడు శరీరం మీద నీకు ఇష్టం వస్తుంది కాని లేకపోతే నీ శరీరం మీద కూడా నీకు ఇష్టం రాదు. నీకు ఇష్టం రావచ్చు, అయిష్టం రావచ్చు. ఇవన్నీ తలంపులే. నీకు అనేక తలంపులు వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. అందులో ఏ తలంపును పట్టుకొన్నా నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. నువ్వు ఇష్టమైన తలంపుని పట్టుకోవద్దు, అయిష్టమైన తలంపుని పట్టుకోవద్దు. చివరికి రెండూ నిన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతాయి. అప్పుడు మీ మనస్సు అంతర్ముఖం అవుతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-2011, హైదరాబాదు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పరమాత్మ యొక్క ఔన్నత్యం మనకు తెలిస్తే భగవద్గీత యొక్క ఔన్నత్యం కూడా మనకి తెలుస్తుంది. పరమాత్మ యొక్క ఔన్నత్యం మనకి తెలియనప్పుడు, పరమాత్మ చేత టీచ్ చేయబడిన గీత యొక్క ఔన్నత్యం మనకి తెలియదు. భగవద్గీత ఎక్కడో చెట్లుకింద కూర్చుని

చెప్పిన గ్రంథంకాదు. యుద్ధ మధ్యమంలో చెప్పినటువంటి గ్రంథం భగవద్గీత. మన మనస్సు మనకి అనుకూలంగా లేకపోతే, మన మనస్సు మనకి స్వాధీనం అవ్వకపోతే మనం గుహలో కూర్చున్నా మనకి శాంతిరాదు. మన మనస్సు మనకి స్వాధీనంలో ఉంటే అది ఒక స్నేహితుడు చేసే మంచి మనకి చేస్తుంది. అందుచేత మన శాంతికి అయినా, అశాంతికి అయినా మనస్సే కారణం. మన మనస్సుని, ఇంద్రియాలను నియమించుకోవటానికే మహాత్ములు కొన్ని నియమాలు చెప్పారు. ఎక్కువగా ఆహారనియమం చెప్పారు. అతిగా భోజనం చేయకూడదని, అతిగా మాట్లాడకూడదని, అతిగా నిద్రపోకూడదని, వ్యవహారంలో కూడా అతిగా ఉండకూడదని చెప్పారు. ఈ నియమాలు ఎందుకు అంటే మనకి స్పిరిట్యువల్ గ్రోత్ రావటానికి చెప్పారు. బ్రెయిన్ ఎప్పుడూ బేలెన్స్‌డ్‌గా ఉండాలి. మనం అనుకున్నది జరిగితే సంతోషిస్తాము. అనుకున్నట్టు జరగకపోతే దుఃఖపడతాము. దాని వలన మనకి ఆధ్యాత్మిక అభివృద్ధి సాధ్యముకాదు.

భగవంతుడి పాదాలను ఎక్కువమంది ధ్యానం చేస్తారు. సీతమ్మ అశోకవనంలో ఉన్నప్పుడు ఆవిడకి దుఃఖం వచ్చినప్పుడు రాముడి ముఖాన్నే ధ్యానం చేసేది. ఎందుచేతనంటే రాముడికి జరిగిన రెండు సంఘటనలు చూసింది సీతమ్మ. దశరథుడు రాముడిని పిలిచి నీకు రేపు పట్టాభిషేకం అని చెప్పాడు. రాముడి ముఖంలో ఏమీ ప్లెజర్ కనబడలేదు. ఆ మరుసటి రోజున రాముడికి కబురు ఏమని వచ్చిందంటే పట్టాభిషేకం లేదు, 14 సంవత్సరాలు అరణ్యవాసం చెయ్యాలి అని. నీకు పట్టాభిషేకం చేస్తున్నాము అన్నప్పుడు రాముడిలో సంతోషం అనే వికారం కనపడలేదు. నీకు పట్టాభిషేకం లేదు, 14 సంవత్సరాలు వనవాసం అని చెప్పినప్పుడు కూడా ఎటువంటి వికారం రాముడిలో కనపడలేదు. అనుకూలమైన వార్త వచ్చినప్పుడు ఒకరకంగా, ప్రతికూలమైన వార్త వచ్చినప్పుడు వేరొక రకంగా కాకుండా సమానంగా ఈక్వల్ మైండెడ్‌గా ఉన్నాడు రాముడు. ఆ రాముడు ముఖాన్ని ధ్యానం చేసేది సీతమ్మ. అందుచేత సీతమ్మ కష్టకాలంలో కూడా క్వయిట్‌గా, కూల్‌గా అశోకవనంలో ఉండగలిగింది.

నిర్మమః అంటే మమకారం లేకుండా ఉండటం నీకు ఎక్కడా మమకారం లేదు అనుకో నీ మనస్సు చలించదు. నీకు మమకారం ఎక్కడైతే ఉందో నీ మనస్సు అక్కడకు వెళ్ళి వాలుతుంది. చాపల్యం లేకుండా దానిని మనం నిగ్రహించుకోవటానికే జపధ్యానములు చెప్పారు. మమకారం ఉన్నంతకాలం మనకి పునర్జన్మ వస్తూ ఉంటుంది. ఈ మమకారం

అనేది పెద్ద జబ్బు. మమకారం పెట్టుకుంటేనే అన్ని అరిష్టాలు మనకి వస్తాయి. భగవంతుడితో ఉన్న ఎటాచ్‌మెంట్‌ని డిటాచ్‌డ్ ఎటాచ్‌మెంట్ అంటారు. అది మనుషులతో ఉండే ఎటాచ్‌మెంట్ లాంటిది కాదు. భగవంతుడితో ఉన్న ఎటాచ్‌మెంటు మనకి దుఃఖాన్ని తీసుకువచ్చేది కాదు. నిరహంకారం అంటే దేహాభిమానం లేకుండా ఉండటం. నేను ఉంటే నాది ఉంటుంది. నేను అనే తలంపు లేకుండా నాది ఉండదు. నేను, నాది ఇవన్నీ తలంపులే. కృష్ణుడు కూడా జీవితంలో అనేక అవమానాలు పొందాడు కాని నిర్వికారంగా ఉన్నాడు. ఎప్పుడూ వికారం పొందలేదు. కారణం దేహాత్మబుద్ధి లేకపోవటం వలన. దేహమే సత్యం, దేహమే ఆత్మ, దేహమే సర్వస్వం అనే బుద్ధి ఉన్నవాడికి బహుమానాలు, అవమానాలు ఉంటాయి కాని ఆ బుద్ధిలేనివాడికి అవమానాలు లేవు, బహుమానాలు లేవు. ఏది అయినా వాడికి వికారం రాదు. జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ఇది ఇలా ఎందుకు జరిగింది, అది అలా ఎందుకు జరిగిందని మనం అనుకుంటాము. ఈ జన్మ మనకి కనిపిస్తోంది, పూర్వ జన్మలు మనకి కనపడవు. మీరు ఒకటి గుర్తుపెట్టుకోండి. ఈ జన్మలకి పునాదిగా ఉన్నది పూర్వజన్మలే. గోడకి పునాదిలో ఉన్న ఇటుకలు కనపడవు, పైన ఉన్న ఇటుకలు కనిపిస్తాయి. అలాగే జీవితంలో జరిగే సంఘటనలు మనకి కనిపిస్తూ ఉంటాయి. కాని ఇది ఇలా ఎందుకు జరిగింది అంటే పూర్వజన్మలకీ ఈ సంఘటనలకీ సంబంధం ఉంటుంది. మన జీవితాలు తెగిపోయిన గాలిపటంలా లేవు.

అర్జునా! నేను మీ అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను. ఉండటమే కాదు పని చేస్తున్నాను. మీ దేహాలు యంత్రాలు. మనిషి యంత్రాన్ని ఎలా తిప్పతాడో అలా మీ దేహానికి ఒక ప్రారబ్ధం ఉంటుంది. ఆ ప్రారబ్ధాన్ని అనుసరించి మీ దేహాలను నేను ఆడిస్తున్నాను. మీ శరీరం ద్వారా ఎప్పడు, ఎక్కడ ఏ పని జరగాలో ఆ పని జరుగుతూ ఉంటుంది. మీకు ప్రేరణ కలగజేసేవాడిని నేను. మీలో అంతర్యామిగా ఉండి పని చేసేవాడిని నేనే. ఈశ్వరుడు అంటే నియమించేవాడు. మిమ్మల్ని, నన్ను, పంచభూతాలను, ప్రపంచాన్ని నియమించేవాడినే ఈశ్వరుడు అంటారు. ఈ సృష్టి అంతా ఈశ్వరుడి స్వాధీనంలో ఉంది. ఐన్‌స్టీన్ ఏమని చెప్పాడు అంటే మనం పట్టకారుని చేతితో పట్టుకోవచ్చుకాని పట్టకారు మనల్ని పట్టుకోలేదు. అలాగే ఎవడైతే మనల్ని ఆడిస్తున్నాడో వాడిని మన మనస్సుతోటికాని, బుద్ధితోటికాని, ఇంద్రియాలతోటికాని మనం తెలుసుకోలేము. ఎవరికైతే మనస్సు, ఇంద్రియాలు అణిగిపోయినాయో, ఎవరి మనస్సు అయితే పల్చబడి చిరిగిపోయిందో, వారికి

భగవంతుడు తెలియబడతాడు. అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడికి నువ్వు శరణాగతిచేస్తే అనిత్యం, అశాశ్వతం, అసత్యం అయినటువంటి ఈలోకంలోంచి నువ్వు విడుదల పొందుతావు. ఈశ్వరుడికి శరణాగతి చేసినవాడికి దుఃఖం దుఃఖం కింద కనబడదు. ఇది దుఃఖమని, ఇది సంతోషమని విడదీసేది మనస్సే. మనం చేసే సాధనల వల్ల ఆ మనస్సు చిక్కబడకూడదు. మనస్సు పల్చబడాలి. మనం మాట్లాడే మాటలు దేహబుద్ధి లేకుండా, దేహాభిమానం లేకుండా మాట్లాడుతూ ఉంటే అది కూడా ఒక సాధన. మాటలో సత్వగుణం ఉండాలి. సత్వగుణం ఉంటే మాట చెప్పేవాడికి, అది వినేవాడికి కూడా ఉపకారం జరుగుతుంది. అందుచేత మనకి గుణాతీతస్థితి ఒకేసారి రాకపోయినా సత్వగుణాన్ని కనుక ప్రాక్టీసు చేస్తే ఎప్పటికైనా మనకి ఆత్మానుభవం కలుగుతుంది.

వారు మా స్నేహితులు అంటారు. స్నేహం అంటే ఆ మనిషిలో ఉన్న బలహీనతలు మనకు తెలిసినా ఆ బలహీనతలతోటి కలుపుకుని వాడిని ప్రేమిస్తేనే అది స్నేహం. మీకు స్నేహితులు ఉంటే వాడి బలహీనతలు మీకు తెలిసి ఉంటే, వాడిని విమర్శించటంకాదు, వాడిని ఎడ్యుకేట్ చేసి ఆ బలహీనతలోంచి మీరు విడుదల చేయగలిగితే అది ట్రూఫ్రెండ్‌షిప్. అది స్నేహధర్మం. ఆత్మజ్ఞానం గురించి, తత్వజ్ఞానం గురించి శ్రవణం చెయ్యాలి. శ్రవణం చేస్తేనేకాని దాని మీద శ్రద్ధ కలుగదు. శ్రద్ధ కలిగితేగాని సాధన చెయ్యాలనే సంకల్పం మనకి రాదు. బ్రాహ్మీస్థితిని ఇప్పుడే, ఇక్కడే పొందటానికి ప్రయత్నం చెయ్యి. ఇప్పుడు, ఇక్కడ పొందటానికి నీకు సాధ్యం కాకపోతే, నీ జీవితంలో చివరి రోజుకైనా ఆ బ్రాహ్మీస్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యి అని పరమాత్మ చెప్పాడు. ఈ బ్రాహ్మీస్థితినే అమృతస్థితి అని పిలుస్తారు. శరీరానికి మృత్యువు వచ్చినప్పుడు మనం అందరం ఇంక ఉండము అనుకుంటున్నాము. అక్కడ నుంచి మరణభయం కలుగుతుంది. శరీరం మరణించిన తరువాత కూడా మనం ఉంటాము. కానీ మనం ఉంటాము అనేటువంటి అనుభవం మనకి లేదు. బైబిలులో ఏమని ఉందంటే “అయామ్ దట్ అయామ్” నేను ఉన్నాను. ఆ ఉన్నదేదో నేనై ఉన్నాను. ఉన్నది వేరు, నేను వేరు కాదు. మనందరికీ ఉండాలని ఉందా? చనిపోవాలని ఉందా? ఎవరికీ చనిపోవాలని లేదు. ఉండాలని ఉంది. ఆ ఉండటమే దేవుడు. ఉండటం అనేది మన సహజస్థితి. చనిపోవటం అనేది అసహజస్థితి. శరీరానికి మరణం ఉంది. నీ లోపల ఉన్న బ్రహ్మపదార్థానికి చావులేదు. నీకు ఇప్పుడు శరీరం అనుభవంలో ఉంది. నువ్వు శరీరంతోటి, నీ మనస్సుతోటి ఎలా తాదాత్మ్యం పొందుతున్నావో

అలాగ నీ హృదయంలో ఉన్న మరణంలేని వస్తువుతోటి నీకు తాదాత్మ్యం కనుక కలిగితే శరీరం చనిపోయినప్పుడు నేను చనిపోవటంలేదు, శరరీం చనిపోతోంది నేను ఉంటాను అని నీకు తెలుస్తూ ఉంటుంది. అప్పుడు వాడు అమృతత్వం పొందాడు అంటారు. అప్పుడు ఇంక నీ జీవితంలో భయంలేదు, దుఃఖం లేదు. రెండో వస్తువు నీకు లేదు. అంతా నీవై ఉంటావు. అమృతత్వం పొందినవాడికి గోయింగు లేదు, కమింగులేదు. ఒకవేళ ఎక్కడికైనా వెళదామన్నా వాడు లేని చోటు అంటూ ఉండదు. మనంలేని చోటంటూ ఉంటే అక్కడికి వెళదాం అనిపిస్తుంది. అంతటా మనం ఉన్నప్పుడు వాడికి ప్రయాణాలతోటి పనిలేదు.

చాలామంది ఏమనుకుంటున్నారు అంటే పుణ్యం చేసుకుంటే చనిపోయిన తరువాత వైకుంఠానికి వెళ్ళిపోతాము, కైలాసానికి వెళ్ళిపోతాము అని అనుకుంటారు, మంచి పనులు చేస్తే వెళతారు, వెళ్ళరని చెప్పటంలేదు. కానీ అవన్నీ పారమార్థిక సత్యం కాదు. అమృతత్వం ఒక్కటే పారమార్థిక సత్యం. అందుచేత బుద్ధుడు, రమణుడు, రామకృష్ణుడు వాళ్ళు మీతోటి ఎలా మాట్లాడినా వాళ్ళు ఏ స్థితిని అయితే పొందారో అక్కడికి మిమ్మల్ని మేల్కొలపటానికే వాళ్ళ మెయిన్ ఉద్దేశ్యం. స్పిరిట్యువల్ టీచర్స్‌కి మానవజాతి మీద ఉన్న ప్రేమ వ్యాపారంకాదు, ప్రేమకోసమే ప్రేమిస్తారు కాని వాళ్ళకి కారణం అక్కరలేదు. మనం ఎదుటిమనిషిని చూచి ఇష్టపడాలి అంటే దానికి ఒక కారణం ఉండాలి. బుద్ధుడి యొక్క ప్రేమకి, ఆచార్యుడి యొక్క ప్రేమకి కారణం ఉండనక్కరలేదు. దానిని అకారణప్రేమ అంటారు. ఈశ్వరుడిమీద ఎవరికైతే అకారణ భక్తి కలిగిందో, అకారణ ప్రేమ కలిగిందో అప్పుడు ఈశ్వరుడి స్వరూపమైన మోక్షాన్ని పొందుతారు.

మీ అందరి హృదయాలలో నేను ఉన్నాను అని పరమాత్మ చెప్పాడు. మరి ఉంటే నాకు ఎందుకు కనబడడు అని ఒకరు అడిగారు. వాడికి సత్వగుణం లేదు, వినయం లేదు, ఇతరులకి సహాయం చేసే బుద్ధిలేదు, వాడి జీవితంలో ఎప్పుడూ నిష్కామకర్మ చేయలేదు, అహంకారంతో జీవిస్తున్నాడు వీడికి దేవుడు తెలియబడాలంట. అంటే వీడికి దేవుడు కనబడకపోతే దేవుడు లేనట్టేనా? నిజంగా దేవుడు లేకపోతే రామకృష్ణుడికి కాని, రమణుడికి కాని వశిష్టుడికి కాని ఎవ్వరికీ అనుభవంలోనికి రాడు. భగవంతుడు ఉన్నాడు కాబట్టి వాళ్ళకి అనుభవంలోనికి వచ్చాడు. మీరు ఒక విషయం గుర్తుపెట్టుకోండి. అధికారము, డబ్బు, విద్య ఇవి ఉన్నవాళ్ళకి నిగ్రహం ఎక్కువ ఉండాలి. నిగ్రహం లేకపోతే వాళ్ళు పాడైపోతారు.

ధనం, అధికారం, చదువు ఇవి చెడ్డవి కాదు, మంచివే. అయితే మీరు సద్వినియోగం చేసుకోవటం మానేసి, మీరు కానిదానితోటి తాదాత్మ్యం కనుక పొందితే మనం తప్పనిసరిగా పాడైపోతాము. మీకు డబ్బు ఉందికాని మీరు డబ్బు కాదు; మీకు చదువు ఉందికాని చదువు మీరు కాదు. మన మైండుతోటి నేర్చుకున్నదంతా ఏదోరోజున మరచిపోతాము. మనం కాని ధనంతోకాని, మనంకాని చదువుతోకాని, మనంకాని గౌరవాలతో కాని, మనంకాని శరీరంతోకాని, మనంకాని మనస్సుతోటి కాని ఏనాటికైనా సెపరేషన్ తప్పదు. ఇది ఒక్కటీ గుర్తుపెట్టుకోండి. మనం ఏది అయితే అవునో దానితోటి సెపరేట్ అవ్వలేము. మన ఇంట్లో పదిమంది ఉంటే పదిమంది ఒకరోజున చనిపోరు. ఎందుచేత? పదిమందీ ఒకేరోజున పుట్టలేదు. ఎవరికి టైమువచ్చినప్పుడు వాళ్ళు చనిపోతూ ఉంటారు. దానికి మన మైండు ప్రిపేరు అయి ఉండాలి. ఒక మనిషి చనిపోయినప్పుడు వాడు జీవించి ఉండగా వాడిపట్ల మనం ఎలా ఉన్నామో వాడు చనిపోయిన తరువాత కూడా వాడి పట్ల అలాగ ఉండగలిగితే వాడికి శాంతి కలుగుతుంది. వాడు చనిపోయాడు అని మనం అనుకోకూడదు, వాడు మన ఇంటి దగ్గరే ఉన్నాడు అని అనుకోవాలి. మనకి ఆ డిఫరెన్స్ తెలియకూడదు. అప్పుడు వాడికి శాంతి కలుగుతుంది, వాడి ప్రయాణం సుఖంగా ఉంటుంది.

ఎవరికి మోక్షం వస్తుందని ఒకరు రమణమహర్షి గారిని అడిగారు. నువ్వు చచ్చిన వాడిలాగ జీవిస్తే నీకు మోక్షం వస్తుంది అన్నారు. దాని అర్థం ఏమిటి అంటే శవానికి ఇంద్రియాలు ఉంటాయి. ఆ ఇంద్రియాలకి ఏమీ కదలిక ఉండదు, చాపల్యం ఉండదు. అలాగ నువ్వు బతికి ఉండగా నీ ఇంద్రియాలకి చాపల్యం కలుగకూడదు. నువ్వు ఆ స్టేట్‌ను జీవించి ఉండగా పొందాలి, పొందితే అప్పుడు నీకు మోక్షానికి యోగ్యత వస్తుంది. లోపల ఉన్న సద్వస్తువు ఎంత పవిత్రమైనదో, ఎంత నిదానమైనదో, ఎంత పరిశుద్ధమైనదో అలాగ నీ మనస్సు కూడా అంత శుద్ధంగా లేకపోతే ఈ మనస్సు వెళ్ళి అక్కడ లయమవ్వదు. అక్కడికి వెళ్ళినా ఆ సద్వస్తువు మన మనస్సుని రిజక్టు చేస్తుంది. ఎప్పుడైతే దీనిని రిజక్టు చేసిందో అక్కడ ఐక్యమవ్వటానికి అవకాశం లేదు. నువ్వు తెలుసుకోవలసింది నీ లోపలే ఉంది కాని బయట ఏమీ లేదు.

కృష్ణా నీ మాయను ఎవరూ జయించలేరు అని చెప్పుకుంటారు, నీమాయ ఎలా ఉంటుందని నారదుడు అడిగాడు. నామాయ ఎలా ఉంటుందో నీకు నోటితో చెబితే తెలుస్తుందా అన్నాడు కృష్ణుడు. నారదా నాకు దాహం వేస్తోంది కొంచెం మంచినీళ్ళు

తెచ్చిపెట్టు అన్నాడు. కృష్ణుడు చెప్పిన మాట నిజమే అనుకుని ఒకరింటికి వెళ్లి ఒక గ్లాసుతోటి మంచినీళ్ళు ఇవ్వమని అడిగాడు. ఒక అందమైన అమ్మాయి మంచినీళ్ళు తెచ్చి నారదుడికి ఇచ్చింది. మంచినీళ్ళ సంగతి మరచిపోయి ఆ అమ్మాయిని మోహించటం మొదలుపెట్టాడు నారదుడు. కృష్ణుడికి దాహం వేస్తోంది అన్న సంగతి మరచిపోయాడు. మోహం అంత బలీయమైనది. చివరికి కృష్ణుడు వచ్చి ఏమిటయ్యా నాకు మంచినీళ్ళు లేవు, ఏమీలేవు అని అడిగితే "మాయ అంటే ఏమిటో ఇప్పడు నాకు తెలుస్తోంది, నా మాయను ఎవడూ జయించలేడు అని చాలాసార్లు చెప్పావు. ఇప్పడు నాకు అర్థమయ్యింది" అన్నాడు నారదుడు. మంచినీళ్లకోసం వెళ్లి సంసారంలో పడ్డాడు అదీ మాయ. ఎవడైతే భగవంతుడి దయకు పాత్రుడు అయ్యాడో వాడు మాయను చాలా తేలికగా దాటగలడు. మన తెలివితేటల వలన మాయను దాటలేము.

మీరు ఈ లోకంలో పుణ్యం చేసినా, పాపం చేసినా ఇక్కడే విడిచిపెట్టి వెళ్లిపోండి. మీకూడా పట్టుకెళితే అనేక ఇబ్బందులు ఉన్నాయి. అందుచేత ఈ లోకంలోనే విడిచిపెట్టి వెళ్లిపోయేలాగ మీరు సాధన చెయ్యండి. ఫర్‌గివ్ సాధ్యమవుతుంది కాని ఫర్‌గెట్ కష్టం. మీకు ఎవరైనా అపకారం చేస్తే ఫర్‌గెట్ దానికి మందు. మీరు ఎవరికైనా ఉపకారం చేస్తే దానికి మందు ఫర్‌గెట్టే. అందుచేత ఫర్‌గెట్ చాలా ముఖ్యం. వాడు ఏదో అన్నాడు, వీడు ఏదో అన్నాడు అని ఇతరులు అన్నమాటలు మీరు ఇంటిదగ్గర అస్తమానూ తలపెట్టుకుంటూ ఆత్మచింతన వదిలేసి, దైవచింతన వదిలేసి, విషయచింతన మొదలుపెడితే ఈ జన్మలోనే మీ బ్రెయిన్ అంతా పాయిజన్ అయిపోతుంది. మీరు మరిచిపోతే ఏమీ లేదు. ఎవరిగురించి అయినా చెడ్డమాటలు చెప్పినా మనం వినకూడదు. దానివలన మన బ్రెయిన్ స్లోగా పాయిజన్ అయిపోతుంది. మంచి వినాలి కాని, చెడ్డమాటలు వినకూడదు. మన ప్రవర్తనలో కూడా జాగ్రత్తగా ఉండాలి. మన బిహేవియర్ ఇంపెర్సనల్‌గా ఉండాలి. సద్వస్తువు కూడా ఇంపెర్సనల్ గానే ఉంటుంది. అందుచేత మనం ఇంపెర్సనల్‌గా జీవిస్తే ఇంపెర్సనల్‌గా ఉన్న వస్తువు మనకి అందుతుంది. మన జీవితాలు తెగిపోయిన గాలిపటాల్లా లేవు. తెగిపోయిన గాలిపటం ఎటుగాలివీస్తే అటు వెళ్లిపోతుంది దానికి కంట్రోలు ఉండదు. కానీ మన జీవితాలు అలా లేవు. ఏ రోజున, ఏ గంటలో, ఏ నిమిషంలో మనం ఎక్కడ ఉండాలో భగవంతుడు నియమిస్తాడు. అయితే వాడు కనబడడు, వినబడడు. సినిమాల్లో మనకి యాక్టర్సు కనిపిస్తారు కాని డైరెక్టరు కనపడడు. అలాగని డైరక్టరు లేడంటామా! డైరక్టరు లేకపోతే సినిమా ఏముంది.

యాక్టర్సు చేత యాక్ట్‌చేయించేది డైరెక్టరే. "ఈ సృష్టికంతా వెనకాల డైరెక్టురుని నేనే. నాకు తెలియకుండా ఈ సృష్టిలో ఏమీ జరగడానికి వీలులేదు. జీవకోటికి అంతర్యామిగా వున్నవాడిని నేనే. అన్ని భూతాల యొక్క క్షేమం కోరేవాడిని నేనే" అంటున్నాడు పరమాత్మ. భగవంతుడు అంటే ఎవరు అని ఏజ్‌టీజ్‌గా కనుక మీకు అర్ధమౌతూవుంటే మీకు శాంతి కలుగుతుంది.

మనం దారిద్ర్యాన్ని భరించగలం కాని అశాంతిని భరించలేము. ఎందుచేతనంటే మన స్వరూపంలో శాంతి ఉందికాని, అశాంతి లేదు. వాడికి ధనం వున్నా, బంగారం వున్నా ఏమి వున్నా శాంతిలేని వాడికి సుఖం వుండదు. మట్టిని, బంగారాన్ని సమానంగా చూడమని భగవద్గీతలో ఒక వాక్యం ఉంది. అది మన గురించి చెప్పలేదు. సాధకుల గురించి, ముముక్షువుల గురించి చెప్పారు. కేవలం నాకు భగవదనుభవమే కావాలి అనుకునేవాడికి మట్టి, బంగారము ఒకలాగే కనపడాలి, ఒకలాగ కనపడే యోగ్యత వాడికి రాకపోతే భగవదనుభవం రాదు. ఉపనిషత్తులలో ఒక కథ ఉంది. భార్యా, భర్త ఇద్దరూ తపస్సు చేసుకోవటానికి వెళుతున్నారు. భర్తముందు, భార్య వెనకాల వెడుతున్నారు. దారిలో బంగారం కనపడింది. భార్య కొంచెం దూరంలో వుంది. భర్త ఏమనుకున్నాడు అంటే రోడ్డు పక్కన బంగారం కనిపిస్తోంది, భార్య ఆ బంగారం చూస్తే దానిమోహంలో పడుతుందేమో అని చిన్నగొయ్యి తీసి బంగారం అందులో వేసి పైన మట్టివేసేసాడు. ఇదంతా భార్య చూస్తోంది. భర్త దగ్గరకు వచ్చి మట్టి కప్పేస్తున్నారు ఏమిటి అని అడిగింది. బంగారం చూచి నువ్వు భ్రాంతి పడతావేమో అని మట్టి కప్పేస్తున్నాను అన్నాడు. అప్పుడు భార్య ఏమంది అంటే నీకు అసలు అజ్ఞానం పోలేదు. నీకు బంగారానికి, మట్టికి తేడా తెలుస్తోంది కదా! అందుచేత బంగారాన్ని మట్టితో కప్పతున్నావు. బంగారానికి, మట్టికి తేడా కనిపిస్తూ ఉంటే నువ్వు మోహంలోనే ఉన్నావు. నేను మట్టిని, బంగారాన్ని తేడాగా చూడటంలేదు అందుచేత నేను మోహంలో లేను, నువ్వు మోహంలో ఉన్నావు అని చెప్పింది.

రమణ మహర్షిగారు అనేవారు కనిపిస్తున్న ఈ లోకం మంచిదీకాదు, చెడ్డదీ కాదు. ఇది డాక్టరు చేసేపని చెయ్యదు, ఎక్స్‌రే చేసే పని చేస్తుంది. నీ లోపల రోగం ఉందో, లేదో ఎక్స్‌రే చెబుతుంది కానీ ఆ రోగాన్ని తియ్యదు. అలాగే నీ మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటో లోకం చెబుతుంది కానీ లోకం బలహీనతల్ని తియ్యదు. నువ్వు సాధన చేసి, ప్రయత్నం చేసి ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందిన వారి సహాయం తీసుకొని నీ వాసనలను నువ్వే పోగొట్టుకోవాలి. మీకు జ్ఞానం ఎప్పుడు కలుగుతుంది అంటే మీకు అనుకూలమైన

సంఘటనలు జరిగినా, ప్రతికూలమైన సంఘటనలు జరిగినా ఎప్పుడూ మీ మనస్సు మిమ్మల్ని ఇబ్బంది పెట్టకూడదు. అదీ జ్ఞానం అంటే. మీరు ఎంత సాధన చెయ్యండి, మీరు నాలుగు వేదాలు చదవండి, అధ్యయనం చెయ్యండి, జపం చెయ్యండి, ధ్యానం చెయ్యండి, సత్‌కర్మ చెయ్యండి, హోలీ కంపెనీ చెయ్యండి ఎన్ని చేసినా మీరు అమృతత్వం పొందాలి అంటే భగవంతుడి దయలేకుండా మీరు పొందలేరు.

సంఘటన వలన, పనివలన మనకి దుఃఖంరాదు. ఆ పని నేనే చేసాను అని అనుకోవటం వలన దుఃఖం వస్తుంది. దానిని కర్తృత్వం అంటారు. భగవంతుడు మనకి కేటాయించిన పని ఈగోలెస్‌గా చెయ్యాలి, హితవుగా చెయ్యాలి, ప్రేమగా చెయ్యాలి, ఇది భగవంతుడి పని అనుకునే చెయ్యాలి. ఆ పని చెయ్యటానికి నువ్వు ఎవరవు? అది ఈశ్వర సంకల్పం. అక్కడ కర్త నువ్వు కాదు. కర్త ఈశ్వరుడు. ఆయన నియమించినట్టుగా జరుగుతుంది. మీ ద్వారా మంచి పని జరగనివ్వండి, చెడ్డపని జరగనివ్వండి ఆ పని వల్ల మీకు దుఃఖం రాదు. అది నా వల్లే జరిగింది అనే తలంపు వల్ల మీకు దుఃఖం వస్తుంది. ఏ సంఘటనవల్ల ఎవరికీ దుఃఖం రాదు. కర్తృత్వం ఉన్నంతకాలం అశాంతి, దుఃఖం, పునర్జన్మలు, చావులు, పుట్టుకలూ ఏదీ తప్పదు. నేను కర్తని అనుకున్నంతకాలం లోకంలో ఎన్ని బాధలు ఉన్నాయో అన్నీ మిమ్మల్ని వెంటాడతాయి. ఇది కర్మ సీక్రెట్. అర్జునా! నువ్వు ఇప్పుడు యుద్ధానికి వచ్చావు. నీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా యుద్ధమనే పని నువ్వు చెయ్యాలి. కర్మ రహస్యం ఎక్కడ ఉంది అంటే నువ్వు ఎలాగూ చెయ్యాలి కాబట్టి ఇష్టంతోటి చెయ్యి. ఇష్టంతోటి చేస్తే పాతవాసనలు పోతాయి. కొత్తవాసనలు రావు. అదే ఇష్టం లేకుండా యుద్ధం చేసావనుకో పాతవాసనలు అలాగే ఉంటాయి. దానికి కొత్త వాసనలు వచ్చి కలుస్తాయి. అందుచేత నీ డ్యూటీ ఇష్టంతోటి చెయ్యాలి. మీరు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకుంటే గోదావరి నదికి వరద వచ్చినప్పడు ఆ ప్రవాహంలో పెద్ద పెద్ద దుంగలు ఎలా కొట్టుకుపోతాయో అలాగ మీకు ఎంత దుఃఖం వచ్చినా కర్తృత్వం లేకపోతే మీ దుఃఖం అంతా అలాగ కొట్టుకుపోతుంది. మీకు కర్తృత్వం లేకపోతే ఆ దుఃఖం మిమ్మల్ని అంటుకోదు.

మీరు ఏకాంతంగా కూర్చున్నప్పడు మన ప్రయత్నం లేకుండా ఈశ్వరుడి యొక్క రూపం వైపుకో, ఈశ్వరుడి యొక్క కళ్యాణగుణాలవైపుకో, ఈశ్వరుడి యొక్క నామం వైపుకో మన మనస్సు వాలిపోవాలి అది పరాయణత్వం. నువ్వు విషయాలకి కాదు నాకు పరాయణుడివి కా అన్నాడు పరమాత్మ. నిరంతరము నన్ను స్మరించేవాడు, నా రూపాన్ని

ధ్యానం చేసేవాడు, నా పని చేసేవాడు, నా కళ్యాణగుణాలను స్మరించుకొనేవాడు నన్ను పొందుతాడు అని పరమాత్మ చెపుతున్నాడు. మీరు అహింస, అహింస అంటున్నారు మరి మానవజాతిలో యుద్ధాలు తప్పవుకదా. యుద్ధాలన్నీ హింసకదా అది అహింస ఎలా అవుతుంది అని ఒకరు బుద్ధుడిని అడిగారు. బుద్ధుడు ఏమని చెప్పాడంటే ఆ యుద్ధం చేసేటప్పడు కర్తృత్వం లేకుండా, ద్వేషం లేకుండా కనుక యుద్ధం చేస్తే అది అహింసలోనికే వస్తుందని చెప్పాడు. మీరు ఎవరితోటి ఎక్కువ స్నేహం చెయ్యవద్దు, వైరాలు కూడా పెట్టుకోవద్దు. మీరు అతిగా స్నేహం చేసినా, ఎక్కువ వైరం పెట్టుకున్నా మీ మనస్సు బాహ్యముఖానికి వస్తుంది. అది ఒక ఎటాచ్‌మెంటుకి దారి తీయవచ్చు, లేకపోతే మీరు పాపం చేయటానికి కూడా అవకాశాలు రావచ్చు. గాంధీగారు భగవద్గీత చదవటానికి సంస్కృతం నేర్చుకున్నారు. గాంధీగారు చిన్నప్పడు తల్లి చనిపోయింది కాని అమ్మలేని లోటు నాకు ఎప్పడూ కలుగలేదు. భగవద్గీత మా అమ్మలేని లోటులేకుండా తీర్చింది. నాకు అనేక సందేహాలు, అనుమానాలు వస్తూ ఉండేవి. నేను భగవద్గీత తీసి చూస్తే అందులో ఏదో ఒక శ్లోకం ద్వారా నా అనుమానాలు, సందేహాలు తీరిపోయేవి. నన్ను అనుమాన రహితుడిని చేసి నన్ను ఆయన స్వరూపంలో స్థిరపడేటట్టు చేసింది భగవద్గీత అన్నారు. గాంధీగారు అనేవారు మీరు ఇప్పడు నన్ను మహాత్ముడు అని అనకండి. మరణకాలంలో కూడా నేను రాముడిని స్మరిస్తే అప్పడు మహాత్ముడిని అని అన్నారు. ప్రతీ జీవుడికి కూడా మరణటైము పరీక్షటైము. మనం జీవితం పొడుగునా సాధన చేసినా మరణకాలంలో పరమాత్మని మరిచిపోతే సున్నా. మీకు భక్తి ఉంది కానీ అది సరిపోదు. మిగతా సంస్కారాల కంటే దైవభక్తి బలంగా ఉండాలి. దైవభక్తి బలంగా ఉంటేనే కాని ప్రాణం పోయే టైములో భగవంతుడు గుర్తుకు రాడు. ప్రాణంపోయే క్షణంలో ఏ తలంపు ఉందో ఆ తలంపును బట్టి నీకు పునర్జన్మ వస్తుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-10-2011, అమలాపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

గాడ్ హేజ్ క్రియేటెడ్ సమ్ సోల్స్ టు లివ్ ఫర్ అదర్స్ ఓన్లీ. చాలామంది వారి కోసం వారే జీవిస్తూ ఉంటారు. భగవంతుని ప్రణాళికలో కొంతమంది మాత్రమే ఇతరులకోసం జీవిస్తూ ఉంటారు. అందరూ ప్రజలకు సేవచేయలేరు. కొద్దిమంది మాత్రమే చేయగలరు, అది భగవంతుడు ఇచ్చిన వరం. మనం చెయ్యాలి అంటే చెయ్యలేము. సమిష్టి పనులు

ఇష్టంగా, ప్రేమగా చేయటం వలన హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. జపం చేయటం వలన, ధ్యానం చేయటం వలన ఏ ఫలితాన్ని పొందుతారో కోరికలేని కర్మ చేయటం వలన, కర్తలేని కర్మ చేయటం వలన అదే ఫలితాన్ని పొందుతారు. సత్కర్మకూడా నిష్కామంగా చేయమని గీతలో పరమాత్మ చెప్పాడు. సైన్సుపేరు మీద, టెక్నాలజీ పేరుమీద మనం సాంప్రదాయాన్ని విడిచిపెట్టకూడదు. సైన్సు, టెక్నాలజీ ఇవి అన్నీ బాహ్యమైన గొడవలు, ఇవి మనస్సును విశాలం చెయ్యలేవు.

మనకు అవుటర్ గవర్నమెంట్ ఉంది. అవుటర్ గవర్నమెంట్ అంటే మనలను పరిపాలించే మంత్రులు, అధికారులు. వీరు మన బాహ్య అవసరాలను చూస్తారు. మనలోపల ఒక ఇన్నర్ గవర్నమెంట్ ఉంది. దాని గురించి చాలామందికి తెలియదు, తెలుసుకోవాలనే కాంక్ష కూడా లేదు. మన శరీరం ఎక్కడ పుట్టాలి, ఏవృత్తిలో ఉండాలి, మరల ఎప్పుడు చనిపోవాలి ఇవి అన్నీ నిర్ణయించేది ఇన్నర్ గవర్నమెంట్. ఇది అంతా భగవంతుడి ప్రణాళికను బట్టి నడుస్తూ ఉంటుంది. మీ జీవతంలో ఏ సంఘటన జరిగినా అది భగవంతుడికి తెలియకుండా రాదు. మనకు ఐశ్వర్యం వచ్చినా, పేదరికం వచ్చినా, మన కుటుంబాలలో ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ మనకు పాఠాలు నేర్పటానికే భగవంతుడు అలా ఏర్పాటు చేసాడు అంతేగాని మన మీద ఆయనకు విరోధంలేదు. అందుచేత మనలో ఒక గవర్నమెంట్ ఉందనీ, మనలను పాలించేవాడు మనలోనే ఉన్నాడని మనం మరిచిపోకూడదు.

మీరు దేనిని చూసి గర్వపడవద్దు. మనకు ధనం ఉంటే, కీర్తిఉంటే, అధికారం ఉంటే మనలో ఏదో విశేషం ఉందని అని మనం అనుకొంటాము. మన దేహంతోటి, మనస్సుతోటి, ఈ ప్రపంచంతోటి సంబంధంలేకుండా మనలో ఒక సద్వస్తువు ఉంది. అది మనకు అనుభవంలోనికి వచ్చినప్పడు మనకు ఉన్న సంపద, అధికారం ఇవి అన్నీ గడ్డిపరకతో సమానం కింద మనకు కనిపిస్తాయి. దేవుడు ఉన్నాడా లేడా అనేది సమస్యకాదు. మనలోపల ఉన్న సద్వస్తువు తాలూక అనుభవం సంపాదిస్తే ఇంక తిరిగి ఈ భూమి మీదకు రానక్కరలేదు. అక్కడికి మేల్కొలపటానికే ఈ సమావేశాలు. ధనంవలన జ్ఞానం రాదు, ధనం వలన భోగం వస్తుంది. భోగాల తరువాత రోగాలు వస్తాయి. కొంతమంది ధనం ఉన్నా నిగ్రహించుకొంటారు, అందరికీ ఆ నిగ్రహం ఉండదు. కొంతమందికి పాండిత్యం ఉన్నా, పాండిత్యం లేనట్లే కనిపిస్తారు. ఎందుచేతనంటే వారికి సబ్జక్టు ప్రధానం, ఆలోచన ప్రధానం, కాని ప్రదర్శన వారికి అక్కరలేదు.

మీరు ప్రదర్శనలోనికి వెళితే వ్యక్తి భావన పెరిగిపోతుంది.

మనం నేను, నేను అంటాము. ఈ నేను అనేది ఒక తలంపు. జీవితంలో నేను అది సాధించాను, నేను ఇది సాధించాను అంటాము. ఈ నేను అనే తలంపును పట్టుకొని రాగద్వేషములు, చావుపుట్టుకలు తిరుగుతూ ఉంటాయి. శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు. ఎవరు చనిపోతున్నారు? దేహం చనిపోతుంది. ఆ దేహంతో తాదాత్మ్యం పొందే నేను నిజమైన నేను కాదు. నిజమైన నేను మటుకు బాడీలెస్, మైండ్‌లెస్, గాడ్‌లెస్ ఆల్‌సో. మనం నేను, నేను అనేది ఒక తలంపు. నేను అనే తలంపు వచ్చాక ప్రపంచం వచ్చింది, దేవుడు వచ్చాడు, పుణ్యపాపములు వచ్చాయి, జన్మలు వచ్చాయి. ఆ నేను అనే తలంపును మనం దాటాలి. ధనంకోసం, పదవులకోసం ఇలా చాలామంది భగవంతుడిని ప్రార్థిస్తూ ఉంటారు. అది పొరపాటు అని నేను చెప్పటంలేదు. కాని ఈ దేహగతమైన నేనులోనుండి విడుదల చేయమని ఎవరూ భగవంతుడిని ప్రార్థించటంలేదు. ఎందుచేతనంటే దాని విలువ వారికి తెలియదు.

మీరు అందరూ సుఖంగా శాంతిగా ఉన్నారా అంటే లేరు. ప్రతీ సంసారంలోకూడా ఏవో సమస్యలు. మీరు బాగున్నారా అంటే బాగానే ఉన్నాము అని చెపుతారు కాని అవన్నీ అబద్ధాలు. పుణ్యాలు చేసుకొని మంచి లోకాలకు వెళదామని చాలా మంది అనుకొంటారు, అలా అనుకోవటం మంచిదే. ఎప్పుడైతే గోయింగ్ ఉందో అప్పుడు కమింగ్ తప్పదు. ఎప్పుడైతే మనిషి పుట్టాడో వాడు చనిపోవటం తప్పదు. ఈ మర్మం అంతా మనస్సులో ఉంది. మనం చాలా విషయాలు నేర్చుకొంటున్నాము కాని మన గురించి మనం నేర్చుకోవటంలేదు. ఇతరులు ఎలా ఉన్నారు అని మనం అనుకొంటున్నాము కాని మన మనస్సు ఎలా ఉంది, మన మనస్సును పవిత్రం చేసుకొంటున్నామా లేదా అనే ఆలోచన మనకు లేదు. మనం ఏదైనా సత్కర్మ చేసినా అది ప్రచారం కోసం చేయకూడదు, భగవంతుడు సంతోషించటం కోసం చేయాలి. సత్కర్మ నిష్కామంగా చేస్తే మనస్సు బాగుపడుతుంది, ఇంద్రియాలు నిర్మలమవుతాయి.

మన శరీరం, మనస్సు సహకరించకుండా మనం ఏదీ సాధించలేము. అందుచేత శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలి. మితభాషణం. అంటే మనం ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు ఎంతవరకు అవసరమో అంతవరకూ మాట్లాడాలి, అతిగా

మాట్లాడకూడదు, చెప్పవలసిన మాటలు విడిచిపెట్టకూడదు, చెప్పకూడని మాటలు చెప్పకూడదు, హితవుగా మాట్లాడాలి, వారి శ్రేయస్సుకోరి మాట్లాడాలి. మితఆహారం. మనదేహం సాధనకు ఉపయోగపడేలా మనం ఆహారం తీసుకోవాలి. ఎక్కువగా తింటే బద్ధకం వస్తుంది, తక్కువగా తింటే నీరసం వస్తుంది, సరిపడగా సమానంగా తినాలి. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉంటే, దేహఆరోగ్యం బాగా చూసుకొంటే ప్రకృతిలో ఉన్న ప్రలోభాలకు లోనుకాము.

మనకు ఉన్న అవిద్యవలన, అజ్ఞానంవలన, మనలో ఉన్న బలహీనతల వలన ప్రపంచంలో ఏదో ఉంది, ఏదో ఉంది అనిపిస్తుంది. బయట ఏమీ లేదు, ఉన్నదేదో నీ హృదయంలోనే ఉంది. మనకు ఉన్న అలవాట్లలోనుండి, బలహీనతలలోనుండి బయటకు వస్తే ఈ ప్రపంచంలో ఏమీసారం లేదు అని అప్పుడు నీకు తెలుస్తుంది. మనకు నిద్రలో స్వప్నం వస్తుంది. స్వప్నంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. జాగ్రదవస్థ లోనికి రాగానే అది అంతా అబద్ధం అని మనకు తెలుస్తుంది. స్వప్నానికి సంబంధించిన ఎక్స్‌టెన్షనే జాగ్రదవస్థ అని మిల్టన్ చెప్పాడు. స్వప్నం పొట్టిగా ఉంటుంది, జాగ్రదవస్థ పొడుగుగా ఉంటుంది అంతే తేడాగాని అదెంత అసత్యమో ఇదికూడా అంతే అసత్యం అని చెప్పాడు. మీరు ఈ శరీరంలో ఉండగానే, ఈ లోకంలో ఉండగానే మీ హృదయంలో ఉన్న సద్వస్తువు మీకు అనుభవంలోనికి రావాలి. అప్పుడు బాహ్యసంఘటనల ప్రభావం మీమీద పడదు. బాహ్యపరిస్థితులు మీకు అనుకూలంగా ఉంటే సంతోషంరాదు, బాహ్యపరిస్థితులు వ్యతిరేకంగా ఉంటే మీకు దుఃఖంరాదు. బాహ్యపరిస్థితులు మీకు వ్యతిరేకంగా ఉన్నా, అనుకూలంగా ఉన్నా ఇది అంతా స్వప్నమే అని మీకు తెలుస్తుంది. మనకు నిద్రలో స్వప్నాలు వస్తాయి, అజ్ఞానంలో జన్మలు వస్తున్నాయి.

నీవు ఎవరో నువ్వు తెలుసుకోవటానికి ఈ భూమిమీదకు వచ్చావు. మనకు నేను అనే తలంపు జాగ్రదవస్థలో ఉంటుంది, గాఢనిద్రలో అది అణిగిపోతుంది, అది అణిగిపోయి నప్పుడు మనకు దేహం గొడవలేదు, ప్రపంచం గొడవ లేదు, ఏగొడవ లేదు. జాగ్రదవస్థలోనికి రాగానే మొదట మనకు నేను అనే తలంపు వస్తుంది, ఆ తలంపు వచ్చాక ఇతర తలంపులు వస్తాయి. ఈ తలంపులు మీరు కాదు, రాగద్వేషాలు మీరు కాదు, చావుపుట్టుకలు మీరు కాదు. ఇవన్నీ మీరు కాదు, మీకు వస్తున్నాయి. ఇక్కడ సబ్జక్టు బాగా అర్థం చేసుకోండి.

సబ్జెక్టు మీకు అర్థమయితే దానిమీద శ్రద్ధ కలుగుతుంది. శ్రద్ధలేకుండా జ్ఞానం కలుగదు. జ్ఞానానికి మించిన సంపద గాని, జ్ఞానానికి మించిన సౌందర్యంకాని, జ్ఞానానికి మించిన భాగ్యం కాని ఈ సృష్టిలో ఏమీ లేదు. మనం పైపై ఉన్న గొడవలకు ప్రాముఖ్యత ఇస్తున్నాము కాని హృదయంలోనికి వెళ్ళాలి అనే గొడవ ఎవరికీ లేదు. స్వర్గరాజ్యం నీ హృదయంలోనే ఉంది. నీకు లోపలచూపు కలుగటంలేదు. నీహృదయంలో ఉన్న శాంతిని, ఆనందాన్ని వదిలేసి రోడ్డుమీద ఉన్న పెంకుముక్కలకోసం తిరుగుతున్నావు. బాహ్యవిషయాలలో మోహంపెట్టుకొని ఎంతదూరం అయితే బయటకు పోయామో మరల అంత వెనక్కి వస్తేకాని మీ మనస్సు దాని గూటిలో పడదు. సహవాసాల విషయంలో మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. మనకు ఏకాంతవాసం కూడా కొంత అవసరం.

ఉన్నాను. ఆ ఉన్నదానిని మనం గుర్తించాలి. అది ఎలా ఉందో అలా మనం ఉండగలగాలి. ఆ ఉన్నదానికి చావులేదు, పుట్టుకలేదు, దానికి ప్రపంచంలేదు, దేవతలు లేరు కాని దానిలో శాంతి ఉంది, సుఖంఉంది, ఆనందం ఉంది. ఉన్నదానిని ఉన్నట్లుగా నువ్వు గ్రహించగలిగితే ఇప్పుడే ఇక్కడే శాంతిలో, సుఖంలో, ఆనందంలో ఊగిసలాడతావు. కొంతమంది వారికి ఉన్న పాండిత్యమే ఆత్మజ్ఞానం అనుకొంటారు. అది చాలా ప్రమాదం. పాండిత్యం అంటే అది మనస్సుతో సంపాదించినది. మనస్సు అణగిపోయినప్పుడు ఇవి అన్నీ అణిగిపోతాయి. ఇవి అన్నీ కూడా చమత్కారాలే. ఉన్నాను అనే దానితో పోల్చుకుంటే మనం ఎంత? మన జీవితం ఎంత? శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అని మనం అనుకుంటాము. ఇలా అనుకొనే వాడికి జన్మరాహిత్యం రాదు. శరీరం చనిపోతున్నా అది ఎలా వచ్చిందో అలా పోతుంది అని ఆ శరీరంతో అనుబంధం లేకుండా నేను ఉన్నాను అని, ఆ ఉండటం అనేది నీకు అనుభవంలోనికి వస్తే అప్పుడు నీకు జన్మరాహిత్యం వస్తుంది. ఆ ఉన్నదేదో మనం తెలుసుకోవాలంటే అది మనకు తెలియబడదు, అది ఎవరికైతే తెలియబడాలి అని అనుకొందో వారికి మాత్రమే అది తెలియబడుతుంది. ఎందుచేతనంటే మన ఇన్నర్‌లైఫ్ దానికి తెలుసు అంటే నువ్వు లోపల ఎలా ఉన్నావో దానికి తెలుసు. మన కోరిక వలన ఏమీ రాదు. మనకు ఎంతవరకుఅర్హత ఉందో, యోగ్యత ఉందో అంతవరకు మనకు వస్తుంది కాని ఏదో కోరిక ఉందని వచ్చి మీద పడిపోదు. అందుచేత ఏవో బాహ్యపరిస్థితులు బాగున్నాయి అని అహంకారం పెంచుకోవద్దు. ఇలా అహంకారం పెంచుకొని చనిపోతారు అనుకోండి రాబోయే జన్మలలో మరల అంత వెనక్కి వస్తేనేగాని మీకు సాధన

ప్రారంభమవ్వదు. అందుచేత గురువు అవసరం. మిమ్మల్ని కరెక్టుగా గైడ్ చేసే వాడే గురువు. మీలో ఉన్న చీకటిని పోగొట్టి మీకు శాంతి ప్రసాదించేవాడే గురువు.

నువ్వు పొందిన శరణాగతి నిజమైతే, నీకు ఉన్న భక్తి నిజమైతే, నీకు ఉన్న జిజ్ఞాస నిజమైతే భగవంతుడు నీకు ఏది అనుగ్రహిస్తే దానితో సంతోషిస్తావు కాని నాకు ఇది కావాలి, అది కావాలి అని అడగవు. నిజమైన నేను ఏమి అడుగదు, దేహగతమైన నేనే ఇవి అన్నీ అడుగుతుంది. ఇలా ఏదో ఒకటి అడిగే కొలదీ నీ స్వరూపానికి నువ్వు దూరమవుతావు. కళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచం అంతా స్వప్నం అని మీకు తెలియాలి అంటే మీకు స్వరూప జ్ఞానం రావాలి. స్వరూపజ్ఞానం రాకుండా ఈ ప్రపంచం అంతా స్వప్నం అని నువ్వు ఎన్నిసార్లు గ్రంథాలలో చదివినా ప్రయోజనం లేదు. గ్రంథాలు చదవటం వలన పాండిత్యం వస్తుంది కాని ఆత్మజ్ఞానం రాదు. భగవంతుడు నీకు ఏది ప్రసాదిస్తే అది తీసుకో, ఆయన ఎక్కడ కూర్చోబెడితే అక్కడ కూర్చో. నీకు ప్రత్యేకంగా కోరికలు వద్దు. నీకు ఎప్పుడు, ఎక్కడ, ఏది అవసరమో అంతా ఆయనే చూసుకుంటాడు. కోరికకు శక్తిలేదు, శక్తి అంతా ఈశ్వరుడిదే. ఆయన ప్రణాళిక ప్రకారం ఈ సృష్టి అంతా నడుస్తోంది. మీకు తెలుసున్నా అంతే, తెలియకపోయినా అంతే. ఈ వాక్యం అర్థమైతే మీలో ఉన్న అశాంతి అంతా ఆరిపోతుంది. మనం చెప్పకొనే దానిలో అరువు బేరాలులేవు, అంతా కేష్ బేరమే. మీరు ఇక్కడ పుణ్యం చేసుకోండి. ఇంకో లోకానికి వెళ్ళి ఆ పుణ్యం అనుభవించవచ్చు, అటువంటి అరువు బేరాలు యిక్కడ లేవు. నువ్వు ఇంకో లోకానికి వెళతావు అక్కడ ఎంతకాలం ఉంటావు. మేము మారని చెక్కులు ఇవ్వము. మీకు ఏదో చెక్కు ఇచ్చి అది మీరు చనిపోయిన తరువాత మారుతుంది అంటే ఆ మాటకు అర్థం ఏమిటి? శరీరానికి అనారోగ్యం వస్తే భరించగలము కాని మనస్సుకి అశాంతి వస్తే భరించలేము.

సత్యాన్ని తెలుసుకోవటానికి శరణాగతి మార్గం, విచారణామార్గం రెండు మార్గాలు చెప్పారు. భగవంతుడి సంకల్పమే నా సంకల్పం, ఆయన ఇష్టమే నా ఇష్టం, నాకు ప్రత్యేకంగా ఇష్టాలు అంటూ లేవు, సంకల్పాలు అంటూలేవు అనుకొనేవాడు శరణాగతికి పనికివస్తాడు. శరణాగతి అందరూ చెయ్యలేరు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అంటే కొంతమంది నూటికి నూరుపాళ్ళు నమ్ముతారు. ఆ నమ్మకం లేని వారికి, విశ్వాసం లేనివారికి నేను ఎవడను అను విచారణ మంచిది. మనం నేను, నేను అంటున్నాము. ఆ నేను అనేది ఒక

తలంపు. ఆ నేను అనే తలంపును దాని మూలంలోనికి పంపగలిగితే, అది నెమ్మదిగా సన్నగిల్లి నశిస్తుంది. అక్కడ ఉన్న సత్యం నీకు ఎరుకపడుతుంది. ఇప్పుడు మనం నేను, నేను అంటున్నాము కదా ఆ నేను నేను కాదని మీకు అర్ధమవ్వాలి. జ్ఞానం అంటే ఏమిటి అని ఒకసారి రామకృష్ణుడిని అడిగారు. నేను అనే తలంపు అందరికి ఉంది. దేవుడు లేడని చెప్పేవారు ఉన్నారు కాని నేను లేనని ఎవరూ చెప్పరు. నువ్వు నేను, నేను అంటున్నావు. ఆ నేను నిజంకాదు కాని అది నిజం అని నువ్వు అనుకొంటున్నావు. ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అని చెప్పారు.

ఉదయం లేచినది మొదలు రాత్రి నిద్రపోయేవరకు దేహగతమైన నేనును ముస్తాబు చేయటం తప్ప మనకు ఇంకోపనిలేదు. మనం ఏదైతే కాదో దానిని ముస్తాబు చేయటమే మనకు సరిపోతోంది. మీరు ఎంతసేపు ఈ దొంగ నేనును అలంకరించటానికి చూస్తున్నారు కాని, దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయటంలేదు. మీరు ఏదైనా ఒక మంచి పనిచేసినా, మంచిమాట మాట్లాడినా, ఎవరికైనా ఉపకారం చేసినా గౌరవాలకోసం, వారు ఏదో మెచ్చుకొంటారు అని చేస్తున్నాము అంటే వాటిని దండలుగా మార్చుకొని, బంగారపు వస్తువులుగా మార్చుకొని ఈ దొంగనేనును అలంకరించుకోవటమే మనం చేసేపని, ఇంకోపని ఏదైనా మనకు ఉందేమో మీరు ఆలోచించుకోండి. మీరు బాగా సంపాదించారా అని ఎవరితోనైనా అనండి, వెంటనే వాడు సంతోషిస్తాడు, అంటే ఆ మాటను వాడి అహంకారానికి దండకింద వేస్తున్నాడు. నిజంగా వాడు సంపాదించాడా, లేదు, ఈశ్వరుడు ఇస్తే వచ్చింది. మనం సంపాదించాలి అంటే సంపాదించగలమా? అందరికీ సంపాదించాలి అని ఉంది సంపాదించుకోగలుగుతున్నారా, లేదు. ఐశ్వర్యం అంతే ఈశ్వరుడిదే, నీకు కోటాకు ఎంత ఇవ్వాలో ఆయన ఇస్తాడు.

మనం మనుషులను అనవసరమైన మాటలు చెప్పి పాడుచేయకూడదు. మీరే రాముడు, శ్రీరాముడే ఈ రూపం ధరించి వచ్చాడు అని మనం ఎవరితోనైనా అంటే పాపం అదే నిజం అని వారు అనుకొంటారు. శాస్త్రిగారికి ఆరోగ్యం బాగా లేనప్పుడు గాంధీగారు ఆయనను చూడటానికి హాస్పటల్‌కు వచ్చారు. ఆయనను చూసి శాస్త్రిగారికి ఎమోషన్ వచ్చి ఈ రోజున నన్ను సాక్షాత్తూ శ్రీరాముడే చూడటానికి వచ్చాడు అన్నాడు. అప్పుడు గాంధీగారు సంతోషించలేదు. శాస్త్రిగారు మీరు తప్పగా మాట్లాడుతున్నారు. రాముడెక్కడ,

నేను ఎక్కడ, రాముడు అంటే అంతర్యామి, ఆయన ఈ సృష్టికి యజమాని అని చెప్పారు. మీరే రాముడు అని మనలను ఎవరైనా అంటే అదే నిజం అనుకొంటాము దానికి కారణం మనలో ఉన్న మైనస్‌పాయింట్స్ ఏమిటో మనకు తెలియకపోవటం వలన అలా అనుకొంటాము. నీ అహంభావనలో ఏదో గొప్పతనం ఉందని ఇప్పుడు నువ్వు అనుకొంటున్నావు. ఈశ్వరుడిని ప్రార్థించగా ప్రార్థించగా, ఆయన గురించి శ్రవణం చేయగా చేయగా ఈ అహంభావన ఎందుకు పనికిరానిది అని అప్పుడు నీకు తెలుస్తుంది. లోపల సుఖం లేనప్పుడు, లోపల ఆనందం లేనప్పుడు నీ అంత గ్రేట్‌మేన్ ఈ అమలాపురంలో ఎవడూ లేడు అని చెప్పకోవటం వలన నీకేమి వస్తుంది. మానవుడు సాధనచేసి కామక్రోధములను దాటవచ్చు కాని వాడు ఎంత సాధన చేసినా ఈశ్వరుని అనుగ్రహం లేకపోతే కీర్తికాంక్షలో నుండి బయటకు రావటం కష్టం. నువ్వుకాని నేనుతో తాదాత్మ్యం పొందుతున్నంతకాలం నువ్వు కీర్తిని కూడా కోరుకొంటావు. రూపబుద్ధిలో నుండి నామబుద్ధిలోనుండి విడుదలపొందకపోతే సత్యం నీకు ఎరుకపడదు.

నువ్వు శరణాగతి మార్గాన్ని అనుసరించు, విచారణామార్గాన్ని అనుసరించు, ఏమార్గాన్ని అనుసరించినా అంకితభావంతో ప్రయాణం చెయ్యి, ఆ మార్గం పట్ల నీకు ఇష్టం ఉండాలి, దానిపట్ల సందేహం ఉండకూడదు, ఆ మార్గం నన్ను ఒడ్డుకు చేరుస్తుంది అనే విశ్వాసం ఉండాలి. మేము శరణాగతి చేస్తున్నాము కాని భగవంతుడి దగ్గరనుండి మాకు సహాయం అందటంలేదు అంటే నువ్వు శరణాగతి చేయటం లేదు అని అర్థం. నువ్వు నిజంగా శరణాగతి చేస్తే ఇటువంటి మాటలు రావు. దేశకాలాలు మనస్సులో ఉన్నాయి. మనస్సును దాటితే టైములేదు, సృష్టిలేదు. మనం సత్యానుభవం పొందాలంటే ఈ ప్రకృతిని దాటి వెళ్ళాలి, ఇంకో మార్గాంతరం లేదు. జిమ్మిక్కుల వలన, చిట్కాల వలన ఆత్మజ్ఞానం కలుగదు. ఇప్పుడు మీకు దేహంతోటి, మనస్సుతోటి తాదాత్మ్యం ఎలా ఉందో అలాగ సత్యంతో తాదాత్మ్యం వచ్చేవరకు సైతాను మిమ్మల్ని విడిచిపెట్టదు, సందేహాలు మిమ్మల్ని విడిచిపెట్టవు. ఒకవేళ విశ్వాసం ఎప్పుడైనా శనివారం కలిగినా అది ఆదివారం పోతుంది. మీరే సత్యం అయినప్పుడు ఇంక సందేహాలు ఏల? అయితే దానిని తెలుసుకొనే ప్రయత్నంలో మటుకు సందేహాలు వస్తాయి. ఒకోసారి విశ్వాసం కూడా పోగొట్టుకొంటాము. మీకు ఉన్న విశ్వాసం నిలబడాలి అంటే దానికి సజ్జనసాంగత్యం అవసరం. నీ దేహంలో నుండి, మనస్సులోనుండి,

ఈ జన్మ పరంపరలో నుండి నీకు స్వేచ్ఛ కావాలి అంటే నీ హృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. నీకు తెలుసున్న, తెలియకపోయినా అది ఎలా ఉందో అలాగే ఉంది. నీకు నమ్మకం లేనంతమాత్రంచేత ఉన్నది లేకుండా పోదు. అయితే నీ నమ్మకం దానిని తెలుసుకోవటానికి సహకరిస్తుంది. అందుకే నీకు విశ్వాసం అవసరం. శాస్త్రం ఎలా చెప్పితే అలా నడుచుకో అంతే కాని నేను చెప్పినట్లుగా శాస్త్రం ఉండాలని అనుకోవద్దు. శాస్త్రాన్ని అనుసరించి కనుక మనం జీవిస్తే మనస్సు అణిగిపోతుంది, యింద్రియాలు అణిగిపోతాయి. ఇంద్రియాలు, మనస్సు నూటికినూరుపాళ్ళు సత్యాన్వేషణకు సహకరిస్తాయి.

నీకు ఏది మంచిదో నీకంటే భగవంతుడికి బాగా తెలుసు. అందుచేత భారం అంతా ఆయన మీద వెయ్యి. ఒకడు రైలులో ప్రయాణం చేస్తున్నాడు. వాడికూడా ఒక పెట్టె ఉంది. వాడికి ఒక ఆలోచన వచ్చింది. ఈ రైలు నన్నూ మోస్తోంది, పెట్టెను మోస్తోంది, రైలుకు బరువు అవుతుందని ఆ పెట్టెను వాడి నెత్తిమీద పెట్టుకొన్నాడు. పెట్టెను నెత్తిమీద పెట్టుకొన్నా ఆ బరువును కూడా రైలే మోస్తోంది అని వాడికి తెలియదు. అలాగే మీరు కర్తృత్వం పెట్టుకొన్నా జరిగేది అంతే, కర్తృత్వం పెట్టుకోకపోయినా జరిగేది అంతే. నెత్తి మీద పెట్టుకోవటం వలన వాడు బాధ ఎలా అనుభవిస్తున్నాడో మీరు కర్తృత్వం పెట్టుకోవటం వలన అలా అనవసరమైన బాధలు, ఇబ్బందులు పడవలసి వస్తుంది. రైలులో ప్రయాణంచేసి పెట్టె వాడి నెత్తిమీద పెట్టుకొన్నవాడు ఎంత అమాయకుడు అని మనం అనుకొంటున్నామో మనంకూడా అంతే అమాయకులం, మనం కూడా అంతే అజ్ఞానులం. ఎందుచేతనంటే నువ్వు కర్తృత్వం పెట్టుకోవటం వలన అదనంగా ఏమీ జరిగిపోదు, కర్తృత్వం లేకపోయినంత మాత్రంచేత జరిగేది జరుగకమానదు. జరిగేది అంతా ఈశ్వరసంకల్పం. ఇది ఇలా జరిగిందేమిటి అని ప్రశ్నలు వేసుకోవద్దు. అలా జరగాలి అని ఇన్నర్ గవర్నమెంటు నిర్ణయించింది కాబట్టి అలా జరిగింది అంతే. శరణాగతి నేర్చుకోండి. ఒకేసారి పూర్ణశరణాగతి రాదు, నెమ్మదిగా ప్రాక్టీసు చెయ్యండి. నీ దేహప్రారబ్దంలో ఉన్న పనిని ఇష్టంలేకుండా చేసే బదులు, ఇష్టంతో చేస్తూ ఉంటే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది, యింద్రియనిగ్రహం వస్తుంది, నీకు సత్యానుభవం కలుగుతుంది. మీరు హృదయంలో ప్రవేశించటానికి, హృదయంలో నిలబడటానికి మేము చేస్తున్న ప్రయత్నమే ఈ ప్రవచనాలు. మీరు అందరూ శాంతిసామ్రాజ్యానికి, సుఖసామ్రాజ్యానికి, ఆనందసామ్రాజ్యానికి అధిపతులు అవ్వాలని కోరుకుంటున్నాము.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| డిసెంబరు | 19 | భీమవరం, శివ కళ్యాణ మండపం |
| డిసెంబరు | 30 | ఏలూరు, శివరావు పేట, వెంకటేశ్వరస్వామి గుడి, సా॥ 6 గంటలకు |
| జనవరి | 1 | పాలకొల్లు, క్షత్రియ కళ్యాణ మండపం |
| జనవరి | 9 | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం, రమణ జయంతి |

## "హితోపదేశము"

ఆదిశంకరుల "తత్త్వబోధ", "వివేక చూడామణి" అన్న ప్రకరణ గ్రంథాలకి సద్గురు శ్రీ నాన్నగారి వివరణ. "శంకరులంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే వారికి బ్రహ్మానుభవం ఉంది. శాస్త్రజ్ఞానం ఉంది. అది ఇతరులకు చెప్పగల పాండిత్యం ఉంది. బ్రహ్మానుభవం, శాస్త్రజ్ఞానం, పాండిత్యం ఈ మూడు ఉన్న జ్ఞానులు అరుదు" అంటారు. నాన్నగారు తమ వివరణలో ఇంతేకాదు "బ్రహ్మమును చెప్పేవారు బ్రహ్మమై ఉండాలి" అని కూడా చెప్పారు.

ఈ పుస్తకం చదువుతుంటే నాకు తోచినది : బ్రహ్మానుభవం. శాస్త్రజ్ఞానం, పాండిత్యం - ఈ మూడు అంతర్లీనంగా ఉండి, నాన్నగారిలో ప్రముఖంగా, ప్రస్ఫుటంగా కనిపించే మరొక అంశం ఉంది, అదే వారి ప్రేమ. అలవోకగా ఆకట్టుకునే ఆ ప్రేమ వారి వివరణలో పడుగూ, పేకలా కలిసిపోయింది. "జ్ఞానియే నిజంగా ప్రేమించగలడు. అతడే నీకు హితుడు". ఇదే నాన్నగారి వ్యక్తిత్వంలో మనల్ని ఆకర్షించి, మనకి తెలియకుండానే ప్రభావితం చేస్తుంది. జ్ఞాని ఏది చెప్పినా "ప్రేమతోనే చెపుతారు. ఆ ప్రేమ నీకు దారి చూపుతుంది" అంటారు వారు.

"హితోపదేశం" శంకరుల తత్త్వబోధకి సమకాలీన స్థితులకి సామరస్యం చూపిస్తుంది. ఆ మార్గం "పాక్షిక సత్యాలనుంచి పారమార్థిక" సత్యాల వైపు నడుపుతుంది. ఈ కారణంగానే ఈ పుస్తకంలో ప్రతీ అధ్యాయం మొదట ఒక ప్రశ్న - సమాధానం - చివరిగా సూత్రప్రాయంగా "మననం చేయదగిన అంశాలు" ఉన్నాయి. అంటే శంకరుల పరిప్రశ్న, భాష్యం, సూత్రరూపంలో మననం అన్న నమూనా సహజంగా, సరళంగా ఇమిడాయి ఈ పుస్తకంలో.

నాన్నగారిది సమగ్ర దృక్పథం. అందుకే జ్ఞానమార్గంలో ప్రమాదాలని తేటతెల్లంగా వెల్లడించారు. ఇదంతా మాయ అని కొట్టిపారేయటం కుదరదు. నిజానికి లౌకిక ప్రపంచంలో మనం నిత్యం చూసే అంశాల నుంచే నాన్నగారు వేదాంత సూక్ష్మాలని రాబడతారు. పైగా ఆ చెప్పటంలో భాష సొగసు, భావగాంభీర్యం చకితుణ్ణి చేస్తాయి. సాధన అంటే? "సంపాదించ వలసింది లేదు. ఉన్నది ఊడగొట్టుకొనటమే" కావలిసింది మరి అడ్డువచ్చేది? మాయ మాయంటే "ఉన్నది లేన్నట్టుగా లేనిది ఉన్నట్టుగా కనిపింపచేసే" మనస్సే మాయ.

నాన్నగారి "హితోపదేశం" వారు చెప్పినవి ఆచరించాలన్న తపన, వ్యాకులత కలిగించే అపూర్వ వివరణ. ఇవి పరాకాష్టకి చేరితే కలిగే "ఆనందం భరించగలమా?" అని అడుగుతారు నాన్నగారు. అందువల్ల ఇది ప్రేమజ్ఞానయోగ కరదీపిక. అధ్యయనమే ఆనందం కలిగించే రస గుళిక. ఈ సందర్భంగా ఒక విన్నపం "భగవద్గీతలో కొన్ని శ్లోకాలు వివరణ ద్వారా గీతాసారం కూడా రసంలో మించి, వశంలో ఉంచే వారి పద్ధతిలోనే చెపితే" మనందరికి మరొక వరం.

**- మ. శివరామకృష్ణ, హైదరాబాద్**

# విశ్వ ప్రేమకు బాహ్యరూపం అహింస

ప్రేమలేని బ్రతుకు ఎడారి వంటిది. మనం మనుషులమేకాదు పశుపక్ష్యాదులను కూడా ప్రేమించాలి. పిల్లల్లో ఇది పొంగి పొరలుతుంది. మొదలు అనేది ఉన్నప్పుడు తుది అనేది ఉంటుంది. ప్రకృతి ప్రేమకు దుఃఖం తప్పదు. మనం ప్రేమించే జీవి మరణిస్తే దుఃఖం తప్పదు. కాని నాశనం లేని ప్రేమను అలవర్చుకోవాలి. అనంతుడైన భగవంతుని (గురుదేవులను) ప్రేమించాలి. ఆయన ఒక్కరే శాశ్వితులు. సమస్తాన్ని ఈశ్వరునిగా చూడాలి. మనం మహాత్ములను ప్రేమించటం పెద్ద విషయం ఏమీ కాదు. మహా పాపిని కూడా మహాత్మునివలె ప్రేమించాలి. ఈశ్వరకృపచే వారి అనుగ్రహశక్తి ఉంటే వానియందు పాపాలను నివారించటానికి ప్రయత్నించాలి. దానికి మార్గం గురుభక్తి. ఈ జగత్తును ఈవిధంగా ప్రేమమయం చేసుకొంటే దివ్యశాంతి మనలో విరాజిల్లుతుంది. గాంధీజీ, మదర్‌థెరిస్సా దీనికి ఉదాహరణలు. ప్రేమతో చిన్న పని చేసినా చాలు. గురునానక్ "భగవంతుని ఆజ్ఞను ఉల్లంఘిస్తే ప్రేమసూత్రం తెగిపోతుంది. వాక్కులో దురుసుతనం ఉంటే ప్రేమ విరిగిపోతుంది. భగవంతుడు పాప వధువును స్వీకరించడు. ప్రేమతో కూడిన భగవత్ భక్తి లేకపోతే మనస్సు నిర్మలంగా ఉండదు. మనం మనలను నిర్మలం చేసుకొని భగవంతుణ్ణి సమీపిస్తే మనకు సత్యం గోచరమౌతుంది" అన్నారు. ఆచారాలు, కర్మకాండలతో, ధర్మగ్రంధాలు చదువుతారు ప్రార్ధనలు చేస్తారు మంచిదే కాని దెబ్బలాడుకోకూడదు. రాళ్లను రప్పలను పూజించి కొంగ జపాలు చేస్తూ దేహం మీద ధార్మిక చిహ్నాన్ని ధరించి గాయత్రిని జపిస్తారు మంచిదేకాని అసత్యం పలుకకూడదు. మెడలో రుద్రాక్షలు, ముఖం మీద జేగూరు రంగు బొట్టు, వంటి మీదకుట్టులేని బట్ట కట్టుకొంటారు. భగవంతుడు సత్యస్వరూపుడు అని గుర్తించాలి. అది నిజమని నమ్మితే ఈ ఆఢంబరమైన కృత్రిమాలు అంతా అసత్యమని నమ్ముతారు. ముఖ్యంగా సాధకులు దీన్ని గుర్తించాలి. మాయలో పడకూడదు. హృదయం నుంచి వచ్చిన మాటలే హృదయాన్ని చేరుతాయి. పాండిత్యం మాటలు ఆ ప్రాంగణానికే పరిమితమైపోతాయి. నిజంగా భగవంతునికి కావలసినది ఒక్కటే మంచి మనస్సు మిగిలినవి అన్నీ ఊకదంపుడు వాగుడు. బాపూ అహింస అనే సత్యాగ్రహాన్ని ఆయుధంగా తీసుకొని ప్రపంచానికి ఆదర్శమూర్తిగా జీవించారు. ఆయన అంటారు "ఈ రోజు గురించి మనం జాగ్రత్త తీసుకుంటే భగవంతుడు రేపటి గురించి జాగ్రత్త తీసుకుంటాడు. నాకు అహింస, సత్యం పట్టుకొమ్మలు" అని. మనం ఇప్పడే ఇక్కడే ఏ జీవిని శారీరకంగా, మానసికంగా హింసకు గురికాకుండా చూస్తాను అని శపధం చెయ్యాలి. హింసించటం వల్ల మనిషికి భయం కలిగి నిర్వీర్యం అవుతాడు. తనకన్న భిన్నంగా చూడని జ్ఞానికి భయం ఎక్కడ. జంతువును హింసించి దాని మాంసాన్ని ఆహారంగా తీసుకుంటే దాని సంస్కారాలు అబ్బి మనస్సు విషపూరితమౌతుంది. జీవహింస పాపాల్లో కెల్ల పాపం. సాత్విక ఆహారం సాధకుని మనస్సు శుద్ధిచేసి సత్యం వైపుకు వెళ్ళేలా సహకరిస్తుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**